www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 150 మంగళవారం, ఫిబ్రవరి 24, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad



రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400


# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

**రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి**

**దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం**

**డిసిసి అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సిఎం భట్టి**



**వికారాబాద్,ఫిబ్రవరి23:**
రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. మిగతాది 2లో...

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

**సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం**

**మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి**

**అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల**



**వాషింగ్టన్,ఫిబ్రవరి23:**
దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. మిగతాది 2లో...

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

**పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం -పంటలకు తీవ్రంగా నష్టంతో రైతుల ఆందోళన**

**హైదరాబాద్,ఫిబ్రవరి23:**
తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. మిగతా 2లో...



# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

**విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ**

**జిఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం**

**ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క**

**హైదరాబాద్,ఫిబ్రవరి23:**
అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, మిగతాది 2లో...



## బీహార్‌లో ఐపీఎస్ అధికారి
# సునీల్ నాయక్ అరెస్ట్

**రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు**




**అమరావతి,ఫిబ్రవరి23:**
రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, మిగతా 2లో...

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత**

**కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23:**
మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనా పరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం మిగతా 2లో...



# జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

**జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత**

**భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ**

**నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత**



వివరాలు 2లో

## 333, 334 సర్వే నంబర్లలో
# అక్రమార్కుల పాగా..?

**పోలీస్ కేసులు పెట్టినా భయపడని కబ్జారాయుళ్లు..!**





కుత్బుల్లాపూర్ రెవిన్యూ పరిధిలో 333, 334 సర్వే నంబర్ల భూములపై అక్రమార్కులు పాగా వేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములుగా గుర్తింపు ఉన్న ఈ భూభాగాల్లో కొంతమంది కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు జరుపుతున్నారనే సమాచారం వెలుగులోకి వచ్చింది.

కుత్బుల్లాపూర్: ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్)


వివరాలు 4లో

# రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

**ఇప్పటికే నలుగురు మృతి..మరో నలుగురి పరిస్థితి విషమం**

**పాలవ్యాపారి గణేశ్ అరెస్ట్.. పరీక్షలకు పాల నమూనాలు**

**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి23:**
రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్. శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పాలు కల్తీ కావడంతో మిగతాది 2లో...



# హైదరాబాద్ మెట్రో పూర్తిగా ప్రభుత్వ స్వాధీనం

**ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం**

**రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం**



వివరాలు 2లో

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

(మొదటి పేజీ తరువాయి

ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం–1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ పక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ పక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్దీ దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూ?ట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4–10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

(మొదటి పేజీ తరువాయి

భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడం తో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయ మయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటం తో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలి పోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు.

# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

(మొదటి పేజీ తరువాయి

వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి




దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ÷ఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు.స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

(మొదటి పేజీ తరువాయి

గ్రౌండ్ హ్యాండ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్ట్రీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ఫ్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం–పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## బీహార్‌లో ఐపీఎస్ అధికారిసునీల్ నాయక్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సునీల్ నాయక్ ఏపీ సీఐడీలో ఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2021లో రాజద్రోహం కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో, సీఐడీ కస్టడీలో ఉండగా తనపై సునీల్ నాయక్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. తన కాళ్లపై తీవ్రంగా కొట్టడం, మానసికంగా వేధించడం వంటి చర్యల్లో సునీల్ నాయక్ కీలక పాత్ర పోషించారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే ఏపీ పోలీసులు బిహార్ ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందించారు. పట్నాలోని స్థానిక కోర్టులో ఆయనను హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ కోరారు. కోర్టు అనుమతి లభించడంతో ఇవాళ రాత్రికి ఆయనను విమానంలో లేదా రోడ్డు మార్గంలో గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ అరెస్టుతో ఏపీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందనే సంకేతాలు ఈ ఘటనతో స్పష్టమవుతున్నాయి. ఈ కేసులో మరికొందరు ఉన్నతాధికారులు కూడా విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

(మొదటి పేజీ తరువాయి

పవన్ కల్యాణ్ నిర్ణయించారు.ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు.జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

## రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

(మొదటి పేజీ తరువాయి

మరణించారని తెలుస్తోంది. దీంతో పాలు పోసే వ్యక్తి గాణెళిశ్‌ను అరెస్ట్ చేశారు. పాలను పరీక్షలకు పంపారు. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణెళిష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. ఆ నమూనాల నివేదికలు రావాల్సి ఉంది.

## హైదరాబాద్ మెట్రోపూర్తిగా ప్రభుత్వ స్వాధీనం

హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం ఈరోజు నిర్ణయించింది. మెట్రో రైలు స్వాధీనంపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది.ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులతో ఈ ఉపసంఘాన్ని నియమించింది. గత సంవత్సరం సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించాలని, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చాయి. నాటి నుంచి స్వాధీన ప్రక్రియ ప్రారంభమైంది.

## జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు.

కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు.జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు.సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు.

# గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

## దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్




**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్)**గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన ప్రతిపాదనల ను సిద్ధం చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి నది తీరం గల జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో గోదావరి పుష్కర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ రాష్ట్రంలో గోదావరి నది తీరంలో జరగనున్న పుష్కరాల సంబంధిత ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేసి సమర్పించాలని తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం, త్రాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, బందోబస్తు ఇతర పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి చేయవలసిన ఏర్పాట్లను, సంబంధించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గోదావరి పుష్కరాలు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా నిర్వహించడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో మొత్తం నాలుగు పుష్కర ఘాట్లలను మంగపేట, ముళ్ళ కట్ట, రామన్న గూడెం, అంకన్నగూడెం పుష్కర ఘాట్ లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని,ప్రతి పుష్కర ఘాట్ వద్ద భక్తులకు త్రాగునీరు మరుగుదొడ్లు పార్కింగ్ విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల పసికందు దారుణ హత్య తెలంగాణ సమాజాన్ని తల వంచేలా చేసింది

## భీమ్ రాజ్ సేన జాతీయ అధ్యక్షుడు రాజేష్ కాంబ్లే



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 23, (పీపుల్స్ న్యూస్ ) :** మానవత్వాన్ని మసకబారే ఈ అమానవీయతను మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఒ భీమ్ రాజ్ సేన వ్యవస్థాపకుడు కాంబ్లే రాజేష్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పసికందును చంపిన ఈ దారుణం మొత్తం తెలంగాణ సమాజాన్ని తల వంచేలా చేసిందని భీమ్ రాజ్ సేన వ్యవస్థాపకుడు కాంబ్లే రాజేష్ విచారం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని కొమ్మెర మల్లన్న ఆలయం ఆవరణలో రెండు నెలల పసికందు దారుణ హత్యపై తీవ్ర దిగ్భ్రాంతి ,ఆగ్రహం వ్యక్తం చేశారు.. రెండు నెలల పసికందుపై జరిగిన ఈ కుల దాడి సమాజంలో కులతత్వం యొక్క నిజమైన ముఖాన్ని చూపిస్తుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నా యనడానికి ఇటువంటి చర్యలు నిదర్శనమని, నేరస్థులకు చట్టమంటే భయం లేదని వారు అన్నారు. ఈ దారుణానికి పాల్పడిన మృగాలను వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఉరితీయాలని ఆయన పోలీసు శాఖను, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే భీమ్ రాజ్ సేన అధ్యక్షుడి నేతృత్వంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. చిన్నారిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు కాంబ్లే రాజేష్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే తగిన ఆర్థిక సహాయం అందించాలని, వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజలు అందించిన అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి

## పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి








**పటాన్ చెరు, ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్) :** ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేసే అవకాశం అతి కొద్ది మందికే లభిస్తుందని..ప్రజలు అందించిన ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం గడ్డ పోతారం మున్సిపాలిటీ తొలి మున్సిపల్ పాలకవర్గం సమావేశానికి ముఖ్య అతిథిగా పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లపాటు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పాలకవర్గానికి సూచించారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని..అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని చూరగొనాలని కోరారు.మున్సిపల్ పరిధిలో గల హెట్రో పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ అనుమతులు లేకుండా 12 ఎకరాల్లో నిర్మాణాలు చేస్తోందని..వెంటనే తొలగించేలా కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనలకు అనుగుణంగా కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేశారు.హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మా, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, కమిషనర్ వెంకటరామయ్య, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బ్యాంకుల పట్ల అవగాహనా కలిగి ఉండాలి

## ఇంచెర్ల ఎస్ బి ఐ జనరల్ మేనేజర్ విజయ్





**వెంకటాపూర్ ములుగు జిల్లా ప్రతినిధి 23(పీపుల్స్ న్యూస్):**బ్యాంకుల పట్ల ఆర్థిక విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలి అని ఇంచెర్ల ఎస్ బి ఐ జనరల్ మేనేజర్ విజయ్ తెలిపారు. సోమవారం వెంకటాపూర్ మండలం లక్ష్మీపురంలో ఉపాధి కూలీలు పనిచేస్తుండగా బ్యాంకుల పట్ల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో మేనేజర్ విజయ్ కౌన్సిలర్ మహేష్ మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్ యొక్క ఉపయోగాలు సైబర్ క్రైమ్స్, సైబర్ క్రైమ్ 1930 నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పొదుపు యొక్క ఉపయోగాలు ఇన్సూరెన్స్ పి ఎం ఎస్ బి వై, పి ఎం జె జె బి వై పాలసీ ఉపయోగాలు ఏటీఎం పట్ల అవగాహన సుకన్యా సమృద్ధి యోజన అటల్ పెన్షన్ యోజన గురించి అవగాహనా కల్పించారు. ప్రతి ఒక్కరూ వీటిపై దృష్టి పెట్టాలని వారికి తగిన బ్రోచర్స్ అందించారు. ఈ కార్యక్రమం సర్పంచ్ సరిత రమేష్, సి ఎఫ్ ఎల్ ములుగు కౌన్సిలర్స్ మహేష్, రమేష్ , రాజ్ కుమార్, లక్ష్మీదేవి పేట ఏఈఓ దయానా, లక్ష్మీ దేవ్ పేట ఫీల్డ్ అసిస్టెంట్ రాధిక, భాస్కర్ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

## ప్రజావాణికి 51 ఫిర్యాదులు.
## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.






**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్)**ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 దరఖాస్తులు రాగా వాటిలో భూ సమస్యలు 15, ఇందిరమ్మ ఇళ్లు 07, ఉపాధి కల్పనకు 06, పెన్షన్ 07, ఇతర శాఖలకు సంబంధించినవి 16 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్వయంగా కలెక్టర్ తో విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యునైటెడ్ వె ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

## బానోత్ నిర్మల వెంకన్న గాంధీనగర్ సర్పంచ్.







**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్)**యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని గాంధీనగర్ సర్పంచ్ భానోతు నిర్మల వెంకన్న అన్నారు. సోమవారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం గాంధీనగర్ గ్రామంలో సర్పంచ్ నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ మేనేజర్ రాములు, గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్ సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న మాట్లాడుతూ గాంధీనగర్ గ్రామంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సేవలు ఎంతో ప్రశంసనీయమని గ్రామంలో పాఠశాలకు మరమ్మతులు మరియు డేస్క్ బెంచీలు కుర్చీలు టేబుల్ లను అందించడం జరిగిందని అదే అదేవిధంగా గ్రామస్తులకు శుద్ధ జలాలను అందించడానికి ప్రత్యేకంగా బోర్వెల్ తో పాటు షెడ్ నిర్మాణం చేస్తున్నందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామస్తులకు త్వరలోనే వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. నిరుపేద ముగ్గురు వితంతు మహిళలకు స్వయం ఉపాధి వ్యాపారం ఏర్పాటు చేసుకోవడానికి సహాయ సహకారాలు అందించడం జరిగిందని అదేవిధంగా గాంధీనగర్ గ్రామాన్ని దత్తత తీసుకొని మరిన్ని అభివృద్ధి పనులతో ముందుకు రావాలని యూనిట్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కోరారు. అనంతరం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ కందూరి,రాములు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి మా సంస్థ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని త్వరలోనే మరిన్ని సేవలతో గ్రామ అభివృద్ధిలో పాల్పంచుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్, గ్రామ కార్యదర్శి భారతి, వార్డు సభ్యులు, లాకావత్ ఈర్య, మాలోత్ శంకర్, లిక్కి కుమారస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, గ్రామం పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున

ఈ సమావేశంలో పాల్గొనడం జరిగింది

# యాసంగి రైతులకు ఎస్సారెస్పీ సాగునీరు లేదా రంగయ్య చెరువు పైపులైన్ సాగునీరు ఇవ్వాలి

## ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన అనంతరం వినతి పత్రం ఇవ్వడం జరిగింది.
## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజాద్ పాషా



**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్)** ములుగు మండలంలోని యాసంగి రైతులకు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా లేదా రంగాల చెరువు పైపులైన్ ద్వారా సాగునీరు ఈ ఆసంగి పంట కాలానికి ఇవ్వాలని ములుగు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని కూడా చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజాద్ పాషా పాల్గొని మాట్లాడుతూ... ములుగు మండలంలోని మదనపల్లి దేవగిరిపట్నం పత్తిపెల్లి కాసిందోపేట జంగాలపల్లి జగ్గన్నపేట పోట్లాపూర్ ఏజెన్సీ గ్రామాల రైతులకు ఈ సంవత్సరం యాసంగి పంట కోసం ఎస్సారెస్పీ సాగునీరు లేదా రంగయ్య చెరువు పైపులైన్ సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ములుగు జిల్లా అధికారులను డిమాండ్ చేయడం జరిగింది. ములుగు మండలంలో సుమారు 8 ఎకరాలలో ఆయా పంటలను సాగు చేయడం జరిగిందన్నారు ములుగు మండలంలో సుమారు 8000 ఎకరాలలో ఆయా పంటలను సాగు చేయడం జరిగిందన్నారు. కావున ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని ఎస్ఆర్ఎస్పీ సాగునీరు లేదా రంగాయచెరువు పైప్ లైన్ సాగునీరు వెంటనే రైతాంగమునకు ఇచ్చి ఆదుకోవాలని ఆయా ప్రభుత్వాలను డిమాండ్ చేయడం జరిగింది. లేనిచో ఈ ఆసంగి పంటలు వేసిన రైతాంగమును సమీకరించి ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయా ప్రభుత్వాలను హెచ్చరించడం జరిగింది. ఈ నిరసన వినతిపత్రం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు వటం సమ్మయ్య భూక్యాపురం సింగ్ ఆగబోయిన పోతాయా రమేష్ లింగమూర్తి సోనూ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం

## పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి







**పటాన్ చెరు, ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్లకు సంబంధించిన సంబంధించిన 54 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 24 లక్షల 43 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు. దీని ద్వారా ప్రతి నెల లక్షలాది రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసిలు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి. అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, సీనియర్ నాయకులు సత్యనారాయణ, వెంకటేష్, ఐలేష్, రామచంద్రా రెడ్డి, శివరాజ్, శివా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఐదేళ్లపాటు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

### పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి







**పటాన్ చెరు, ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్) :** రాబోయే ఐదేళ్లపాటు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాలకవర్గానికి సూచించారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గుమ్మడిదల మున్సిపాలిటీ తొలి మున్సిపల్ పాలకవర్గం సమావేశానికి పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని..అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని చూరగొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం







**పటాన్ చెరు , ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్) :** ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ జాతర కార్యక్రమాల్లో పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోటె సుమలత, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్) :** కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. సోమవారం మాదాపూర్ లోని న్యాక్ బిల్డింగ్ సైబరాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్‌గా జి. సృజన బాధ్యతలు స్వీకరించిన శుభసందర్భంగా ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ హైదరాబాద్ ప్రగతి ప్రస్థానంలో సరికొత్త అధ్యాయం మొదలైందని గొప్ప చరిత్ర కలిగిన మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. పరిపాలన సౌలభ్యం, వేగవంతమైన అభివృద్ధి కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించింది అని అన్నారు. ప్రభుత్వ ఆలోచన విధానాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లని, కూకట్ పల్లి నియోజకవర్గంలో అక్రమ కట్టడాల అరికట్టాలని, రోడ్ల మరమత్తులు, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి వంటి అంశాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. దీనిపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# డిప్యూటీ కమిషనర్ వాటా ఎంత..?

## ముడుపులు అందడంతోనే.. వేగంగా నిర్మాణ పనులు..!



**కుత్బుల్లాపూర్ : ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్):** అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవలసిన అధికారులు.. వాటిని ప్రోత్సహిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం వాటి పరిచర్యలు తీసుకోకుండా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మహాదేవపురం ఊ-94 నంబర్ గల ప్లాట్ లో ఓ నిర్మాణదారుడు +o2 నిర్మాణానికి అనుమతి తీసుకుని ఏకంగా నాలుగు అంతస్తులు అక్రమ నిర్మాణం చేశారు. దీనిపై అనేక ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడం పై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. బాధ్యత కలిగిన అధికారులే.. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వలన ప్రభుత్వానికి నష్టం తో పాటు, అనేక ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని ప్రజలు గుర్తు చేస్తున్నాను.

**సర్కిల్--57లో టౌన్ ప్లానింగ్ అధికారుల అక్రమాల ఆరోపణలు...**

గాజులరామారం సర్కిల్--57 పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, అదే విషయాన్ని డబ్బు వసూళ్లకు సాధనంగా మార్చుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.స్థానికుల కథనం ప్రకారం, అనుమతులు లేకుండా లేదా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు, మొదట నోటీసులు ఇచ్చి భవన యజమానులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారట. "బిల్డింగ్ కూల్చివేస్తాం", "క్రిమినల్ కేసులు పెడతాం" అంటూ హెచ్చరించి, అనంతరం 'సెట్టిల్‌మెంట్' పేరుతో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.కొంతమంది భవన యజమానులు పేరు వెల్లడించకూడదనే షరతుపై మాట్లాడుతూ, "నిర్మాణం ప్రారంభ దశలోనే అధికారులు వచ్చి అక్రమమని చెబుతారు. తర్వాత విషయం బయటకు వెళ్లకుండా చూడాలంటే లక్షల్లో డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తారు" అని వాపోయారు. డబ్బులు చెల్లించిన వారిపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, చెల్లించని వారిపై మాత్రం కఠిన చర్యలు చేపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంలో కొన్ని మధ్యవర్తులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని సమాచారం. అధికారులకు, భవన యజమానులకు మధ్య 'సెట్టింగ్'లు జరిపించి కమిషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఫలితంగా అక్రమ నిర్మాణాలు ఆగకపోగా, అవి మరింత పెరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.నగరాభివృద్ధి, ప్రణాళికాబద్ధమైన నిర్మాణాలు లక్ష్యంగా ఉండాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం, అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవడం కంటే వాటిని ఆదాయ వనరుగా మార్చుకుంటే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, సర్కిల్--57లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిజంగా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయా? లేక ఇవి కేవలం ఆరోపణలేనా? అన్నది స్పష్టతకు రావాలంటే టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు దర్యాప్తు అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఇప్పటికైనా అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోండి.**

గాజుల రామామారం సర్కిల్ 57 పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలంటే కమిషనర్ చొరవ తీసుకోవాలని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే కమిషనర్ కనుసన్నలోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. వీటి నుండి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బయట పడాలంటే అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపి ఆయన నిజాయితీనే నిరూపించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# 333, 334 సర్వే నంబర్లలో అక్రమార్కుల పాగా..?

## పోలీస్ కేసులు పెట్టినా భయపడని కబ్జారాయుళ్లు..!

**కుత్బుల్లాపూర్: ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్):** కుత్బుల్లాపూర్ రెవిన్యూ పరిధిలో 333, 334 సర్వే నంబర్ల భూములపై అక్రమార్కులు పాగా వేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములుగా గుర్తింపు ఉన్న ఈ భూభాగాల్లో కొంతమంది కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు జరుపుతున్నారనే సమాచారం వెలుగులోకి వచ్చింది.స్థానికుల కథనం ప్రకారం, ఈ సర్వే నంబర్లకు సంబంధించి ఇప్పటికే వివాదాలు నడుస్తున్నప్పటికీ, కొందరు వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లతో కొనుగోలు, విక్రయాలు కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. కొన్ని సందర్భాల్లో కేసులు నమోదైనప్పటికీ, కబ్జారాయుళ్లు మాత్రం ఎలాంటి భయం లేకుండా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉండగా, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్‌లు జరగడంపై సంబంధిత రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరైన ధృవీకరణ లేకుండా రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో మరిన్ని భూవివాదాలు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కబ్జారాయుళ్లు మారరు..**

గాజులరామారం ప్రాంతంలో లాలా బేగం కు సంబంధించిన ఆస్తులను కొందరు కబ్జారాయుళ్లు అక్రమంగా కొల్లగొట్టినట్లు ఆధారాలు బయటకు వస్తున్నాయి. టైటిల్ స్పష్టత లేకుండానే నకిలీ పత్రాలు సృష్టించి, అనేక సంతకాలను ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్లు నిర్వహించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సుమారు మూడు ఎకరాల విలువైన భూమిని కబ్జా చేసి, 120 గజాలుగా ప్లాట్లు విభజించి విక్రయిస్తున్నట్లు సమాచారం. స్థానికుల వివరాల ప్రకారం, అసలు యజమానుల అనుమతి లేకుండానే కొందరు దందాదారులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, వాటిని ఆధారంగా చేసుకుని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఫోర్జరీ సంతకాలతో రూపొందించిన పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూపిస్తూ అమాయక కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిని చిన్న చిన్న ప్లాట్లుగా విభజించి, 120 గజాల చొప్పున విక్రయించడం ద్వారా కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయని సమాచారం. అయితే భూమికి సంబంధించిన అసలు టైటిల్, పహాణీలు, రెవెన్యూ రికార్డులు స్పష్టంగా లేవని స్థానికులు చెబుతున్నారు.ఈ వ్యవహారంపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫోర్జరీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, అమాయక ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.భూమి కొనుగోలు చేసే ముందు సంబంధిత పత్రాలను న్యాయ నిపుణులతో పరిశీలించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలకు కరెంటు మీటర్లు... అధికారులపై చర్యలేదా?**

గాజుల రామారం పరిసర ప్రాంతాల్లో సర్వే నెంబర్ 333, 3334 లో అక్రమ లేఅవుట్లు, అనుమతులు లేని భవనాలు వేగంగా పెరుగుతున్నాయి. నిర్మాణాలకు సరైన అనుమతులు లేకపోయినా, విద్యుత్ మీటర్లు మంజూరు కావడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. పట్టణ ప్రణాళిక, రెవెన్యూ శాఖలు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం, అనుమతులు పొందిన నిర్మాణాలకు మాత్రమే విద్యుత్, నీటి కనెక్షన్లు ఇవ్వాలి. కానీ అక్రమ లేఔట్లకు ఎందుకు ఇస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.న్యాయస్థానాలు కూడా అక్రమ నిర్మాణాలపై కఠిన ఆదేశాలు జారీ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ, కోర్టు ఆదేశాలను పక్కనబెట్టి నిర్మాణాలు పూర్తి చేసి, అనంతరం యుటిలిటీ కనెక్షన్లు పొందడం ద్వారా ప్రభుత్వాన్ని, న్యాయవ్యవస్థను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.నిపుణుల అభిప్రాయం ప్రకారం,అక్రమ నిర్మాణాలకు సేవలు అందించడం కూడా చట్టపరమైన నేరమే. సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. అలాగే, తప్పుడు డాక్యుమెంట్లు సమర్పించి కనెక్షన్లు పొందిన నిర్మాణదారులపై కూడా మోసం కేసులు నమోదు చేయవచ్చని చెబుతున్నారు.









**District**
Medchal-Malkajigiri | మేడ్చల్-మల్కాజిగిరి

**Mandal**
Quthbullapur | ఖుతుబుల్లాపూర్

**Village**
Gajularamaram | గాజులరామారం

**Pattadar / Authorised Person Name**
లాలా బేగం జాంగీర్ బేగం / లాలా బేగం జాంగీర్ బేగం

**Father / Husband's Name**
నిల్ / నిల్

**Khata Number**
372

**PPB Number**
Passbook number not available

**eKYC Status**
Aadhaar not available

**Total Extent (Ac. Gts)**
1.3800

**Survey No./ Sub-Division No.**
333

**Land Status**
Not Signed

**Nature of Land**
Dastu Gardha Inam

**Classification of Land**
Magani Do Fasla

**Land Type**
Agriculture Lands

**Market value of Survey no.(in INR)**
47190000

**Transaction Status**
--

## కల్తీ పాల ఘటన.. ఉన్నతాధికారులతో మాట్లాడిన ఆరోగ్యశాఖ మంత్రి



**తూర్పుగోదావరి, ఫిబ్రవరి 23:** రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న కల్తీ పాల ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పాలు, నూనెలు, ఇతర వాటి సేకరణ ఎంతవరకు జరిగింది? ఫలితాలు ఎలా ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. నమూనాల సేకరణ, ఫలితాల పరిస్థితి ఏమిటి? అని అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కల్తీ పాల బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.వ్యాపారి నుంచి సేకరించిన పాలు, పాల ఉత్పత్తుల నమూనాలను ప్రయోగశాలలకు పంపించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఫలితాలొచ్చేందుకు 72 గంటల వరకు సమయం పడుతుందని తెలిపారు. ఆసుపత్రుల్లో ఉన్న వారి నుంచి కూడా రక్త నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రుల్లో ఉన్న బాధితుల నివాస పరిసర ప్రాంతాల వారి ఆరోగ్య వివరాలనూ సేకరిస్తున్నామన్నారు.కాగా.. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ అమరావతి నుంచి రాజమహేంద్రవరం బయల్దేరారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం) డైరెక్టర్ నీలకంఠారెడ్డి ఇప్పటికే రాజమహేంద్రవరం వెళ్లారు. పాల వినియోగంపై బాధిత కుటుంబాల వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో నమూనాల సేకరణ, తదుపరి చర్యలపై సమీక్షించారు.

## ఉగాదికి జాబ్ క్యాలెండర్.. జాబితాలోనే డీఎస్సీ పోస్టులు!



**అమరావతి, ఫిబ్రవరి 23:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు.జాబ్ క్యాలెండర్, డీఎస్సీపై ప్రకటనరాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. విశేషమేమిటంటే, ఈ జాబ్ క్యాలెండర్‌లోనే పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.కేజీబీవీ పాఠశాలలపై చర్చగాంధీ బాలికా విద్యాలయా పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్ అమలు చేయా లని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు.దీనికి మంత్రి నారా లోకేశ్ సమాధా నమిస్తూ.. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో కేజీబీవీలకు ఎక్కువ డిమాండ్ ఉందని, అడ్మిషన్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొందని తెలిపారు. జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారుపాలిటెక్నిక్, ఐటీఐ విద్య విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న పారిశ్రామిక ఎకో సిస్టమ్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను 'క్లస్టర్ బేస్డ్ అప్రోచ్' ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

## తమిళనాడు ఎస్ఐఆర్ తుది జాబితా విడుదల.. 74 లక్షల మంది ఓటర్ల తొలగింపు




**చెన్నై:** తమిళనాడు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తికావడంతో తుది జాబితాను ఎన్నికల సంఘం సోమవారం నాడు విడుదల చేసింది. సవరించిన జాబితా కింద రాష్ట్రంలోని 74 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి ఈసీ తొలగించింది. మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్ల బాజితాలో చోటుచేసుకు న్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు 6.41 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. సోమవారంనాడు చెన్నైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తమిళనాడు చీఫ్ ఎలక్షన్ అధికారి అర్చనా పట్నాయక్ ఈ జాబితాను విడుదల చేశారు.తాజా జాబితాలో 5.67 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా, వీరిలో 2.77 కోట్ల మంది పురుషులు, 2.89 కోట్ల మంది మహిళలు 7,617 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. క్లెయిమ్‌లు, అబ్జెక్షన్ పీరియడ్‌లో దాఖలు చేసిన దరఖాస్తులను సమీక్షించి మార్పులు చేసినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. 2025 డిసెంబర్ 19 నుంచి 2026 జనవరి 30 వరకూ ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించాల్సిందిగా 4.38 లక్షల అప్లికేషన్లు వచ్చాయని, వీటిలో 4.23 లక్షల ఎంట్రీలను వెరిఫికేషన్ అనంతరం తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించామని పేర్కొంది.కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ వేసవి సీజన్‌లోనే జరగనున్నాయి. కేరళ, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, అస్సాం ఎన్నికలు కూడా ఇదే పీరియడ్‌లో జరగాల్సి ఉన్నాయి.

## దర్శన క్యూలైన్‌లో పాము కాటు ప్రచారం అవాస్తవం : టీటీడీ




**తిరుమల :** తిరుమలలో దర్శన క్యూలైన్ లో మహిళా భక్తురాలికి పాము కాటు) అని ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తమని టీటీడీ( వెల్లడించింది. తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన శరత్ బాబు, మౌనిక దంపతులు ఆదివారం రాత్రి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు ( వచ్చారని వివరించారు.ఈ నేపథ్యంలో ట్యాక్సీలో మ్యూజియం సమీపాన ఉన్న ఆర్.బి.సెంటర్ పార్కింగ్ ఏరియాకు చేరుకోగానే మౌనిక తన పాదాలకు పసుపు రాసుకునేందుకు చీకటిలో పక్కనే ఉన్న స్థలంలోకి వెళ్లిందన్నారు. ఈ క్రమంలో కాలుపై స్పర్శ తగలడంతో భయపడి భర్త శరత్ వివరించగా ఆ ప్రాంతాన్ని పరిశీలించగా చిన్న పాము కనిపించిందన్నారు.వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారం అందించడంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే తిరుమలలోని అశ్విని ఆసుపత్రికి తరలించారని, వైద్యులు పరీక్షలు నిర్వహించి ఎలాంటి పాము కాటు లేదని నిర్ధారించారని వివరించారు. అయినప్పటికీ మహిళా భక్తురాలి ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఎలాంటి సమస్య లేదని నిర్ధారించారని వెల్లడించారు. ఆ పాము కూడా విషపూరితం కాదని విచారణలో తేలిందన్నారు. సోమవారం ఉదయం దంపతులు క్షేమంగా శ్రీవారిని దర్శించుకున్నారని తెలిపారు.భక్తులు తమ భద్రత దృష్ట్యా టీటీడీ నిర్దేశించిన ప్రాంతాల నుంచి మాత్రమే క్యూలైన్లలోకి వెళ్లాలని, తిరుమల పరిసరాల్లోని నిషేధిత అటవీ ప్రాంతాల్లో సంచరించవద్దని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేసింది .

# జిన్నారం సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి










**పటాన్ చెరు, ఫిబ్రవరి 23 (పీపుల్స్ న్యూస్) :** జిన్నారం మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం జిన్నారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పురపాలక సంఘం తొలి పాలకవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల పరిషత్ గా ఉన్న జిన్నారం నేడు మున్సిపల్ గా మారడం జరిగిందని.. ఇందుకు అనుగుణంగా ప్రతి వార్డు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు సిద్ధంగా ఉన్నాయని.. అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడాలని.. తదనంతరం ప్రజాసేవ లక్ష్యంగా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ.. మున్సిపాలిటీని అభివృద్ధికి ప్రత్యేకగా తీర్చిదిద్దాలని విన్నవించారు. అభివృద్ధి పనులు.. సమస్యల పరిష్కార అంశంలో తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం పాలకవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన బీఏసీ సమావేశం.. కీలక నిర్ణయాలివే



**అమరావతి, ఫిబ్రవరి 23:** ఏపీ శాసనమండలి బీఏసీ సమావేశం (సోమవారం) జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ భేటీ కాసేపటి క్రితమే ముగిసింది. (మంగళవారం) హోంశాఖపై మండలిలో చర్చ జరగనుంది. రేపు (బుధవారం) శాసనమండలిలో వ్యవసాయ శాఖపై చర్చ జరగనుంది. ఈ నెల 26వ తేదీన మండలిలో టీటీడీ లడ్డూలో నెయ్యి కల్తీపై చర్చించనున్నారు. ఈ నెల 28వ తేదీన మండలికి సెలవు ప్రకటించిగా, తిరిగి 4వ తేదీన శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ప్రతిప క్షనేత బొత్ససత్యనారాయణ కల్పించుకొని.. అధికార పక్షం బీఏసీ సమావేశంలో ఒకటి చెప్పి సభలో ఇంకొకటి చెబుతున్నారని వ్యాఖ్యానించారు.తాము సభలో, బయటా ఒకటే చెబుతున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. శాసనమండలితో పాటూ సభ బయట కూడా నెయ్యి కల్తీపై చర్చకు రెడీగా ఉన్నామని అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కూడా.. సభలో కల్తీ నెయ్యిపై వంద రోజులైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారన్నారు. తాము అసెంబ్లీలో, శాసనమండలిలో కూడా కల్తీ నెయ్యిపై చర్చ పెడతామని మొదటి రోజే చెప్పామని ప్రస్తావించారు. బడ్జెట్‌పై చర్చ పెట్టాలని ప్రతిపక్షనేత బొత్ససత్యనారాయణ పట్టుబట్టారు. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ఆ ఘనత ఎన్డీఏదే..బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్-3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించింది' అని సీఎం చెప్పారు.ఇప్పటికే బడ్జెట్‌పై చర్చ పూర్తి అయిందని మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు ప్రజా సమస్యలను గాలికొదిలి, రాజకీయ ప్రయోజనాల అంశాన్ని ఎంచుకొన్నారని మంత్రి పయ్యావుల కేశవ్ ఫైర్ అయ్యారు. లడ్డూలో కల్తీ నెయ్యి అంశంపై నాలుగు రోజులు వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని వ్యాఖ్యానించారు. కల్తీ నెయ్యిపై తాము చర్చకు సిద్ధమని పలుమార్లు చెప్పినప్పటికీ వైసీపీ సభ్యులు ఎందుకు పట్టించుకోలేదని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు.

# కల్తీపాల బాధ్యులను వదిలేది లేదు: సీఎం చంద్రబాబు





**అమరావతి, ఫిబ్రవరి 23:** రాజమండ్రి కల్తీ పాల ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. కల్తీ పాల ఘటన బాధాకరమన్నారు. ఈ ఘటనలో నలుగురు చనిపోగా.. ఇద్దరు వెంటిలేటర్‌పై ఉన్నారని ఆయన తెలిపారు. మరో 8 మందికి చికిత్స కొనసాగుతోందని చెప్పారు. మృతులు కృష్ణవేణి, రాధా కృష్ణ, శేషగిరిరావు, రమణిల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.పాలతోనే డయాలసిస్ సమస్య వచ్చిందన్నారు. కల్తీ పాల బాధ్యులను వదిలేది లేదని తేల్చి చెప్పారు. పాల వ్యాపారి నాగేశ్వరరావును అరెస్ట్ చేశామని చెప్పారు. కల్తీ చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దోషులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కల్తీ పాల మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని వెల్లడించారు. కొద్దిసేపటి క్రితం రాజమండ్రిలో అనూరియా వ్యాధి మరణాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఘటనపై అధికారుల ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్యసాయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కాగా, రాజమహేంద్రవరంలోని లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి 15 నుంచి పలు వురు.. వాంతులు, మూత్ర విసర్జన కాకపోవడం, కడుపు ఉబ్బరం తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ఈ రకమైన కారణా లతో 14 మంది నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో కృష్ణవేణి, రాధాకృష్ణ, శేషగిరిరావు, రమణి మృతి చెందారు.

# తిరుమల లడ్డూ అంశం అసెంబ్లీలో కీలక చర్చ



**అమరావతి, ఫిబ్రవరి 23:** తిరుమల శ్రీవారి ప్రసాదం తయారీలో నెయ్యి బదులు రసాయనాల మిశ్రమం వినియోగంపై అసెంబ్లీ సాక్షిగా చర్చించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం అసెంబ్లీలో ఈ అంశంపై నాలుగు గంటలపాటు చర్చించాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయం అనంతరం జీరో అవర్‌ను రద్దు చేసింది. రేపు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నెయ్యి కల్తీపై చర్చించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఉదయం10.30 గంటల నుంచి నెయ్యి కల్తీ పై కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన 10 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో మాట్లాడించనున్నారు. ఇక డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆ కారణంగా ఆయన సోమవారం అసెంబ్లీకి హాజరుకాలేదు. రేపటి సభలో లడ్డూ కల్తీ నెయ్యి అంశంపై డిప్యూటీ సీఎం పవన్ ఈ చర్చలో పాల్గొనే అవకాశం ఉంది. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి కల్తీ నెయ్యిపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేయనున్నారు.మరోవైపు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిబంధనలు మరింత కఠినతరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిబంధనలు ప్రకారం అన్యమతస్థులు శ్రీవారి దర్శనం చేసుకోవాలంటే.. డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనను ఇకపై తప్పనిసరిగా అమలు చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వనుంది. అమృతసర్‌లో స్వర్ణ దేవాలయానికి ఉన్న ప్రత్యేక చట్టం వలే టీటీడీకు సైతం చట్టం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ స్వర్ణ దేవాలయానికి ఉన్న ప్రత్యేక చట్టం ద్వారా తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అధికారం ఉంది. ఇదే తరహా చట్టాన్ని టీటీడీకి కూడా తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో స్వర్ణ దేవాలయం చట్టాన్ని వెంటనే అధ్యయనం చేయాలంటూ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం: హోం మంత్రి



**అమరావతి, ఫిబ్రవరి 23:** జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం 8వ రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు.ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.ఇక ఈ బిల్లుపై చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైళ్ల శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ చట్టంలో ప్రస్తావన లేదన్నారు. జైళ్లలో ఖైదీల సంఖ్య పెరిగినా సౌకర్యాలు మాత్రం పెరగటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జైళ్ల శాఖలో 30 శాతం సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయని వివరించారు. జైళ్లలో మహిళా సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. అండర్ ట్రయల్ ఖైదీలు న్యాయ సహాయం లేకపోవడంతో జైళ్లలోనే ఉండిపోతున్నారని గుర్తు చేశారు.చిన్న చిన్న కేసుల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారి సత్ ప్రవర్తన ఆధారంగా బయటకు పంపించాలన్నారు.

# లంచం అవినీతే సీఎం అసలైన స్నేహితులు



**తమిళనాడు** : తమిళనాడు రాజకీయాల్లో ఎన్నికల వేడి పెరుగుతున్న వేళ, నటుడిగా స్టార్‌డమ్ సాధించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ అధికార పార్టీ డీఎంకేను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పిస్తూ, ఆయన అసలైన స్నేహితులు లంచం, అవినీతి, స్వార్థ రాజకీయాలేనని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు.
మార్పు ఎక్కడుంది?వెల్లూరులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన విజయ్, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రచారం పూర్తిగా నాటకమని అన్నారు. “రాష్ట్రాన్ని సూపర్‌స్టార్ స్టేట్ చేశామని చెబుతున్నారు. కానీ ప్రజల జీవన స్థాయిలో మార్పు ఎక్కడుంది?” అంటూ ప్రశ్నించారు. తమిళనాడు గతంలో నిజమైన అభివృద్ధిని చూసిందంటే అది కామరాజ్, అన్నాదురై, ఎంజీఆర్ వంటి మహానేతల కాలంలోనేనని గుర్తుచేశారు.చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయంటూ!ఆ రోజుల్లో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగేదని, ఇప్పుడు మాత్రం ప్రచారం, రాజకీయ లాభాలే ముఖ్యమైపోయాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఉల్టా మోడల్ గవర్నమెంట్, స్టాండ్ అప్ కామెడీ ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, చరిత్రాత్మక ఎన్నికలుగా నిలుస్తాయని విజయ్ పేర్కొన్నారు. “ఈసారి అందరూ కలిసి నన్నే లక్ష్యంగా చేసుకున్నారు. అయినా ప్రజలే నా బలం” అన్నారు. అసలు పోరు తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) డీఎంకే మధ్యేనని స్పష్టం చేశారు.ప్రజల హక్కును ఎవరూ లాక్కోలేరు!“తమిళనాడు అంటే విజయ్– విజయ్ అంటే తమిళనాడు” అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసిన ఆయన, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని చెప్పారు. స్టాలిన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని, పేదల సమస్యలు అలాగే ఉన్నాయని ఆరోపించారు. టీవీకే అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు వెళ్లి ప్రజలను స్వయంగా కలుస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పౌరుడి సమస్యను వినిపించి పరిష్కారం చూపుతానన్నారు. ప్రజల ఓటు హక్కు పవిత్రమని, ఎవరూ దాన్ని లాక్కోలేరని స్పష్టం చేశారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు విజల్?కు ఓటు వేయాలని కార్యకర్తలు, అభిమానులను కోరారు. “మా ఓటు, మా హక్కు” అంటూ నినాదాలు చేశారు.రాజకీయాల్లో ఆసక్తిఇదిలా ఉండగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానంగా అధికార డీఎంకే కూటమి, ప్రతిపక్ష అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఏఐఏడీఎంకే) ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి మధ్య పోటీ నెలకొంది. ఎన్డీఏలో భారతీయ జనతా పార్టీ కీలక పాత్ర పోషిస్తోంది. ఇక డీఎంకే కూటమిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సహా పలు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ రాజకీయ సమీకరణాల మధ్య విజయ్ పార్టీ టీవీకే కొత్త శక్తిగా రంగప్రవేశం చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.సినీ కెరీర్‌కు గుడ్‌బై చెప్పి పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టిన విజయ్, యువత మరియు అభిమానుల మద్దతుతో ముందుకు సాగుతున్నారు. ఆయన సభలకు భారీగా జనసందోహం తరలివస్తుండటం రాజకీయ వర్గాల్లో ఇపప్డు చర్చనీయాంశమవుతోంది. అధికార పార్టీపై నేరుగా దాడి చేస్తూ, ప్రజలతో భావోద్వేగ అనుబంధం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి, విజయ్ వ్యాఖ్యలతో తమిళనాడు రాజకీయాల్లో వేడి మరింత పెరిగింది. డీఎంకే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ, ప్రత్యామ్నాయ నాయకత్వంగా తనను ప్రజలకు పరిచయం చేసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ వ్యాఖ్యలు ఎంత మేర ప్రభావం చూపుతాయో, టీవీకే ఎంత వరకు ప్రభావం చూపగలదో ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

## బంగాల్ రాజకీయ చాణక్యుడు ఇక లేరు - టీఎంసీ అగ్రనేత ముకుల్ రాయ్ కన్నుమూత



**బంగాల్** :గత కొన్నిరోజులుగా కోమాలో ఉన్న బంగాల్‌కు చెందిన సీనియర్ రాజకీయ నేత, రైల్వే శాఖ మాజీ మంత్రి ముకుల్ రాయ్ (71) కన్నుమూ శారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 1.30గంటల ప్రాంతంలో గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు శుంభ్రాన్శు రాయ్ తెలిపారు. ముకుల్ మృతి పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు సంతాపం తెలుపుతున్నారు.ముకుల్ రాయ్ ప్రస్థాన.లెఫ్ట్ భావజాలంతో వామపక్ష పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత కాంగ్రెస్ నేత మృణాల్ సిన్హరాయ్ ప్రోత్సాహంతో ఆ పార్టీలో చేరారు. ఈ క్రమంలోనే ఆయనకు మమతా బెనర్జీతో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం బంగాల్ రాజకీయ చరిత్రను మార్చేసే ద్వయానికి పునాది అయ్యింది. 1998లో మమతా బెనర్జీ కాంగ్రెస్‌ను వీడి సొంత పార్టీ పెట్టాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆమెతో నడిచిన అతికొద్ది మందిలో ముకుల్ రాయ్ ముందు వరుసలో ఉంటారు. తృణమూల్ కాంగ్రెస్ 9మంది వ్యవస్థాపక సభ్యుల్లో ముకుల్ రాయ్ ఒకరు. మమతా బెనర్జీ పార్టీకి ముఖచిత్రంగా ఉంటే, తెర వెనుక ఉండి పార్టీ యంత్రాంగాన్ని నడిపించడంలో ముకుల్ కీలక పాత్ర పోషించారు.ముకుల్ రాయ్ కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా, జాతీయ రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించారు. 2009లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ–2 ప్రభుత్వంలో ఆయన షిప్పింగ్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2011లో మమతా బెనర్జీ పశ్చిమ బంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో, కేంద్ర రైల్వే మంత్రి పదవికి దినేష్ త్రివేదిని నియమించారు. అయితే, రైల్వే ఛార్జీల పెంపు విషయంలో తలెత్తిన విభేదాల కారణంగా త్రివేది తప్పుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మమతా బెనర్జీ అత్యంత తనకు అత్యంత నమ్మకస్తుడైన ముకుల్ రాయ్‌ను కేంద్ర రైల్వే మంత్రిగా నియమించారు.

## అమెరికా దాడుల భయం.. ఇరాన్‌లో పరిస్థితి ఉద్రి



**ఇరాన్** : ఏ క్షణమైనా ఇరాన్ పై అమెరికా దాడులు చేయవచ్చునన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు అక్కడి మన ఎంబసీ తాజాగా అడ్వయిజరీ జారీచేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది.‘ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా జనవరి 5న భారత ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వయిరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండండి’ అని ఇరాన్‌లోని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో పేర్కొన్నది.అలాగే తాజా పరిణామాల సమాచారం కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచించింది. భారతీయులంతా పాస్‌పోర్ట్‌లు, ఐడీ కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పింది. ఈ విషయంలో ఎలాంటి సాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొంది. ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలి’ అని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో తెలిపింది.

# 30 సెకన్లలో 27 కత్తిపోట్లు- సినీ ఫక్కీలో మైనర్ల దాడి- చెంపదెబ్బ కొట్టాడనే కక్షతోనే!




**మధ్యప్రదేశ్** :మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో దారుణం జరిగింది. స్నూకర్ క్లబ్?లో మైనర్ల మధ్య జరిగిన వివాదం కలకలం రేపింది. పదో తరగతి చదువుతున్న విద్యార్థిపై తోటి విద్యార్థులు కత్తితో దాడి చేశారు. కేవలం 30 సెకన్లలోనే 27 సార్లు కత్తితో పొడిచాడు. సినీ ఫక్కీలో జరిగిన ఈ దాడి ఆలస్యంగా వెలుగులో వచ్చింది.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ఈ ఘటన ఫిబ్రవరి 15న జరిగింది. అందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ దృశ్యాలు ఆ తర్వాత వెలుగులో వచ్చాయి. ఈ ఘటనలో గాయపడిన 16 ఏళ్ల విద్యార్థి, గౌతమ్ నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. అతడు రోజూ టీలా జమాల్?పురా గణేష్ చౌక్‌లోని స్నూకర్ క్లబ్ వెళ్తుంటాడు. నిందుతులు, బాధితుడు ఒకే కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకుంటున్నారు. అయితే ఫిబ్రవరి 15నక్లబ్ వద్ద ఇద్దరు మైనర్ విద్యార్థులు ముందుగానే వేచి ఉన్నారు. 10వ తరగతి విద్యార్థి అక్కడికి చేరుకున్న వెంటనే అతనిపై దాడి ప్రారంభించారు. సినిమా స్టైల్?లో క్లబ్?లోకి ప్రవేశించి కత్తితో తీవ్రంగా గాయపరిచారు. 30 సెకన్లలో 27 సార్లు కత్తితో పొడిచారు. వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో విద్యార్థి చేతికి 10కు పైగా లోతైన గాయలు అయ్యాయి. రెండు వేళ్లు తెగిపోయాయి. అంతేకాకుండా భుజం, వీపుపై కూడా తీవ్రంగా గాయాలు అయ్యాయి. అక్కడ ఉన్నావారు గాయపడిన విద్యార్థిని వెంటనే ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.పాత గొడవే కారణంఈ దాడికి కారణం పాత గొడవే అని పోలీసులు తెలిపార. క్లబ్?లో కొద్ది రోజులు వీరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో బాధితుడు, ఇద్దరు నిందితులను చెంపదెబ్బ కొట్టాడు. దీంతో కక్ష పెంచుకున్న విద్యార్థులు, బాధితుడిపై ఫిబ్రవరి 15న దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు మోదు చేశారు. దాడి కేసుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు టీలా జమాల్?పురా ఎస్పీ అశుతోశ్ ఉపాధ్యాయ్ తెలిపారు. ఇద్దరు మైనర్లకు నోటీసులు జారీ చేసి విడిచిపెట్టినట్లు చెప్పారు. వైద్య నివేదికల ఆధారంగా మరిన్ని అభియోగాలు నమోదు చేసినట్లు వెల్లడిం చారు. అయితే ఘటనకు సంబంధించిన వీడియోను సదరు విద్యార్థులే సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలిపారు. వాటి ఆధారంగానే కేసు నమోదు చేసిటన్లు చెప్పారు.వీడియో గేమ్స్?లో ఎర– పిల్లల లైంగిక వీడియోలు సేల్– దంపతులకు ఉరిశిక్షఇది ఉండగా, చిన్న పిల్లల లైంగికంగా వేధించే వీడియోలు చిత్రీకరించి వాటిని డార్క్? వెబ్?లో ప్రసారం చేసిన ఓ జంటకు ఇటీవల ఉరిశిక్ష విధించింది బాండా పోక్సో కోర్టు. ఉత్తర్?ప్రదేశ్ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మాజీ జూనియర్ ఇంజినీర్ రాం భావన్ (50), అతడి భార్య దుర్గావతి (47) కలిసి దాదాపు 33 మంది బాలబాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వెల్లడైంది. 3 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలను లైంగికంగా వేధించే 2 లక్షల వీడియోలను తీసి, వాటికి రేటు కట్టి డార్క్ వెబ్‌లో 47 దేశాల వాళ్లకు అమ్మేశారని దర్యాప్తులో గుర్తించారు. దాదాపు 12 ఏళ్ల పాటు ఈ దందాను రాం భావన్, దుర్గావతి దంపతులు నడిపారని విచారణలో తేలింది. 2010 నుంచి 2020 వరకు బండా చిత్రకూట్ ప్రాంతాల్లో ఈ దారుణాలకు పాల్పడినట్లు గుర్తించారు. చిన్నారులను ఆకర్షించేందుకు ఆన్?లైన్ వీడియో గేమ్స్?కు యాక్సెస్ ఇవ్వడం, నగదు బహుమతులు ఇవ్వడం వంటి చేసినట్లు తెలిసింది.2020 అక్టోబరులో ఈ సెక్స్ రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రాం భావన్ దంపతులపై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసింది. అనంతరం 2021 ఫిబ్రవరిలో ఛార్జ్‌షీట దాఖలు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 20న బాండా ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. న్యాయస్థానం వారిద్దరికి మరణశిక్షను విధించింది. బాధిత బాలబాలికలు అందరికీ రూ.10 లక్షలు చొప్పున పరిహారాన్ని చెల్లించాలని ఉత్తర్?ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. రాం భావన్ దంపతుల ఇంట్లో నుంచి సీజ్ చేసిన రూ.8 లక్షలను కూడా బాధిత బాలలకు సరిసమానంగా పంచాలని నిర్దేశించింది.

# రూ.5 లక్షల లంచం కేసులో బీజేపీ ఎమ్మెల్యేకు జ్యుడీషియల్ కస్టడీ



**కర్ణాటక** :కాంట్రాక్టర్ నుంచి రూ.5 లక్షల లంచం తీసుకుంటూ కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రు లమాని పట్టుబడ్డారు. కోర్టులో హాజరుపరచగా మార్చి 3వరకు జ్యుడీషియల్ కస్టడీని విధించింది. గదగ్ నుంచి బెంగళూరుకు తీసుకువచ్చి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.
ఇదీ జరిగిందిలోకాయుక్త అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, గదగ్ జిల్లాలోని సంకదల్ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న అడ్డుగోడ నిర్మాణానికి దాదాపు రూ.కోటి రూపాయలు ఖర్చవుతుందని అంచనా. దీనిని అమలు చేసేందుకు శిరహట్టి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే కమిషన్?ను డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ విజయ పూజారాను రూ.11 లక్షల లంచం ఇవ్వాలని చెప్పారు. దీంతో కాంట్రాక్టర్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తనను రూ.11లక్షలు లంచం అడిగారని చెప్పారు. దీంతో ఎమ్మెల్యేను రెడ్? హాండెడ్?గా పట్టుకునేందుకు ఒక ప్లాన్ చేశారు. దాని ప్రకారం శనివారం గదగ్ జిల్లాలోని లక్ష్మేశ్వర్ పట్టణంలోని ఎమ్మెల్యే యాజమాన్యంలోని బాలాజీ ఆసుపత్రిలో రూ.5లక్షల లంచం ఇచ్చేందుకు కాంట్రాక్టర్ వెళ్లాడు. లోకాయుక్త అధికారులు కూడా అక్కడే ఉన్నారు. రూ.5లక్షలు తీసుకుంటుండగా, లోకాయుక్త పోలీసులు ఎమ్మెల్యేను పట్టుకున్నారు. ఆయనతో పాటు ఇద్దరు పీఏలు మంజునాథ్, గురు నాయక్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు.కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసనలుఅయితే అధికారుల దాడి సమయంలో పీఏ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలోకి ఒక కాగితంలో రూ.50,000 నోట్ల కట్టను విసిరాడు. వెంటనే లోకాయుక్త అధికారులు అక్కడికి చేరుకుని పీఏ విసిరిన డబ్బును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. లోకాయుక్త అధికారుల దాడి వార్త తెలియగానే, ఎమ్మెల్యేల మద్దతుదారులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బాలాజీ ఆస్పత్రికి చేరుకున్నారు. ఇది కావాలనే ఎమ్మెల్యేపై పన్నిన కుట్ర అని ఆరోపించారు. పెద్ద సంఖ్యలో జనం గుమిగూడి గందరగోళం సృష్టించే అవకాశం ఉన్నందున, ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు ప్రజలను అక్కడి నుంచి చెదరగొట్టారు.
శనివారం రాత్రే ఎమ్మెల్యే చంద్ర లమానీ, ఆయన ఎమ్మెల్యేలను బెంగళూరుకు తీసుకువచ్చారు. అంతేకంటే ముందు గదగ్? జిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బెంగళూరులోని ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే వారికి మార్చి 3 వరకు జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేసింది. ఆ తర్వాత ఆయన్ను పరప్పన అగ్రహారంలోని బెంగళూరు సెంట్రల్ జైలుకు తరలించారు.ఆరోపణలు చేసినవారే లంచం కేసులో చిక్కుకున్నారు – సీఎం సిద్ధరామయ్య
ఈ విషయంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఇతరులపై అవినీతి ఆరోపణలు చేసే బీజేపీ నాయకులు ఇప్పుడు లంచం కేసులో చిక్కుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. ‘శిరాహట్టి బీజేపీ ఎమ్మెల్యే చంద్రు లమాని లంచం కేసులో లోకాయుక్త అధికారులకు చిక్కారు. ఇతర పార్టీల వ్యక్తులపై బీజేపీ నేతలు సులభంగా లంచం ఆరోపణలు చేసేవారు. ఇతరుల వైపు వేలు చూపిన బీజేపీ నేతలే ఇప్పుడు లంచం కేసులో చిక్కుకోవడం సిగ్గుచేటు. లోకాయుక్త దర్యాప్తు కొనసాగనివ్వండి. పూర్తి నిజం బయటకు రావాలి. మేము దానిని అడ్డుకోం’ అని సిద్ధరామయ్య అన్నారు.జేపీపై డీకే వ్యంగ్యాస్త్రాలమరోవైపు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా బీజేపీపై విమర్శలు చేశారు. దేశంలో అత్యంత నిజాయితీపరులు బీజేపీ రాజకీయ నాయకులు కాదా అని వ్యంగ్యంగా అన్నారు. లోకాయుక్త ఒక స్వతంత్ర సంస్థ, దాని దర్యాప్తులో తాము జోక్యం చేసుకోమని తెలిపారు. లోకాయుక్తలో నమోదైన ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## రాజగోపాలాచారి ప్రతిమను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ:** బ్రిటీష్ రాజ్యాధికారానికి చిహ్నాలుగా ఉన్న ఆనవాళ్లను ప్రభుత్వం తొలగిస్తున్నది. దీనిలో భాగంగా ఇవాళ ఎడ్విన్ లుటెన్స్ ప్రతిమను తొలగించి, దాని స్థానంలో తొలి గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి ప్రతిమను ప్రతిష్టించారు. రాష్ట్రపతిపభవన్ వద్ద చక్రవర్తి రాజగోపాలాచారి ప్రతిమను ఇవాళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించారు. అశోక మండపం వద్ద ఉన్న గ్రాండ్ ఓపెన్ స్టెయిర్‌కేస్ దగ్గర చక్రవర్తి రాజగోపాలాచారి బొమ్మను ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి భవన్‌ను నిర్మించిన ఎడ్విన్ లుటెన్స్ స్థానంలో రాజగోపాలాచారి ప్రతిమను ఓపెన్ చేశారు.బ్రిటీష్ మైండ్‌సెట్‌ను పారద్రోలి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేయనున్నట్లు రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మాట్లాడారు. రాజాజి ప్రతిమను ఆవిష్కరించడం అంటే.. బ్రిటీష్ పాలకుల ప్రభావాన్ని పారద్రోలడమే అవుతుందని అన్నారు. సీ రాజగోపాలాచారిని గుర్తు చేసుకోవడం అటే రాజాజి ఉత్సవాన్ని నిర్వహించడమే అన్నారు. బ్రిటీష్ ప్రాబల్యం నుంచి బయటపడే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. గులామీకి మనసిక్తా సే ముక్తి అన్న విజన్‌తో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇది ప్రభుత్వ సేవా భావనను ప్రతిబింబిస్తుందన్నారు.

## ముస్లిం మహిళల పట్ల బీజేపీ నేత వివక్ష దుప్పట్ల పంపిణీ నిరాకరణ



**జైపూర్:** ఒక బీజేపీ నేత ముస్లిం మహిళల పట్ల వివక్ష చూపారు. వారికి దుప్పట్లు పంచబోనని చెప్పారు. ముస్లిం మహిళలకు పంపిణీ చేసిన బ్లాంకెట్స్‌ను వెనక్కి తీసుకున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని వారితో అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని టోంక్ సవాయి మాధోపూర్‌కు చెందిన బీజేపీ నేత, మాజీ ఎంపీ సుఖ్‌బీర్ సింగ్ జౌనాపురియా ఆదివారం ఒక కార్యక్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. అయితే మహిళల పేర్లు అడిగి బ్లాంకెట్లు ఇవ్వాలని తన అనుచరులకు సూచించారు.కాగా, ఒక ముస్లిం మహిళ తన పేరు చెప్పగా ఆమెకు దుప్పటి ఇవ్వవద్దని సుఖ్‌బీర్ సింగ్ చెప్పారు. ముస్లిం మహిళకు ఇచ్చిన బ్లాంకెట్‌ను వెనక్కి తీసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని దూషించే వారికి దుప్పట్లు తీసుకునే హక్కులేదని తెలిపారు. ‘నా మాట వినండి, (ప్రధానమంత్రి) మోదీని దుర్భాషలాడే వారికి (దుప్పట్లు) తీసుకునే హక్కు లేదు. దాని గురించి మీరు చెడుగా అనుకుంటే నేనేమీ చేయలేను’ అని అన్నారు. ముస్లిం మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయన ఆదేశించారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.మరోవైపు, టోంక్ సవాయి మాధోపూర్ కాంగ్రెస్ ఎంపీ హరీష్ చంద్ర మీనా ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. బీజేపీ నేత సుఖ్‌బీర్ సింగ్ తీరును ఆయన ఖండించారు. ‘పేద, నిస్సహాయ మహిళల పేర్లు అడిగి దుప్పట్లు పంపిణీ చేయడం, వారి మతం తెలుసుకుని వెనక్కి తీసుకోవడం సిగ్గుచేటు, అమానుషం’ అని ఎక్స్‌లో విమర్శించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# తేజస్ ఫైటర్ జెట్లను భారత్ పక్కన పెట్టిందా



**న్యూఢిల్లీ:** స్వదేశీ యుద్ధవిమానం తేజస్ మళ్లీ ప్రమాద వార్తల్లో నిలిచింది. ఫిబ్రవరి 7వ తేదీన సరిహద్దు ప్రాంతానికి సమీపంలోని వాయుసేన ఎయిర్‌బేస్‌లో ల్యాండింగ్ సమయంలో తేజస్ ఫైటర్ జెట్ రన్‌వేను దాటి వెళ్లడంతో విమానం నిర్మాణ భాగాలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఆ ఘటనలో పైలట్ ముందస్తు జాగ్రత్త పడడంతో సురక్షితంగా బయటపడ్డాడు.తేజస్ ఫైటర్ జెట్లను భారత్ పక్కన పెట్టిందాబ్రేక్ వ్యవస్థలో లోపం కారణంగానే ఆ ప్రమాదం జరిగి ఉండొచ్చని వర్గాలు చెబుతున్నాయి. ఆ ఘటనపై అధికారిక ప్రకటన విడుదల చేయకపోయినా, భారత వాయుసేన ముందు జాగ్రత్త చర్యగా తమ వద్ద ఉన్న దాదాపు 30 సింగిల్‌సీట్ తేజస్ విమానాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి విమానాన్ని సాంకేతికంగా పూర్తిగా తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం.తేజస్ అంటే ఏమిటి?హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేసిన ఎల్‌సీఏ తేజస్ ఒక సింగిల్ ఇంజిన్, మల్టీ రోల్ ఫైటర్ జెట్. దీన్ని ఏరానాటికల్ డెవలప్?మెంట్? ఏజన్సీ అభివృద్ధి చేసింది. గగనతల రక్షణ, సముద్ర పర్యవేక్షణ, కచ్చితమైన దాడులు వంటి అనేక మిషన్లకు అనువుగా ఆ విమానాన్ని రూపొందించారు. 2003లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్?పేయూ దీనికి తేజస్ అనే పేరు పెట్టారు. సంస్కృతంలో తేజస్ అంటే కాంతి, శక్తి అనే అర్థం.ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు జరిగాయంటే తేజస్ విమానాలు 2016 నుంచి వాయుసేనలో సేవలు అందిస్తున్నాయి. ఇప్పటివరకు మూడు ప్రధాన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మొదటి ఘటన 2024 మార్చిలో రాజస్థాన్?లోని జైసల్మేర్ సమీపంలో జరిగింది. ఆపరేషనల్ ట్రైనింగ్ సమయంలో తేజస్ విమానం కూలిపోయింది. అయితే పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ ఘటనపై విచారణ కమిటీని నియమించారు. రెండో ప్రమాదం ఎక్కడ జరిగిందంటేరెండో ప్రమాదం 2025 నవంబర్‌లో దుబాయ్ ఎయిర్‌షోలో జరిగింది. ఎయిర్ డెమోన్స్ట్రే షన్ సమయంలో విన్యాసాలు చేస్తుండగా విమానం అదుపు తప్పి నేలమీద పడిపోయింది. ఈ ఘటనలో పైలట్ ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. దీనిపై కూడా విచారణ చేపట్టారు. ఇప్పుడు తాజా ఘటన మూడోది. అయితే ఇది క్రాష్ కాకపోయినా, రన్‌వే దాటడం వల్ల విమానం దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది.

# కాఫీ తాగితే లివర్ క్యాన్సర్ దూరం! - నిపుణులు ఏమంటున్నారో తెలుసా?



ఉదయం లేవగానే కాఫీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. ఇది నూతన ఉత్సాహాన్ని, ఏకాగ్రతను పెంచుతుంది. ఇంతే కాకుండా, శరీరంలోని అత్యంత ముఖ్యమైన అవయవాలలో ఒకటైన కాలేయానికి రక్షణ అందిస్తుందని పరిశోధనలు చెబుతున్నారు. ఆ వివరాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!రోజువారీ కాఫీ వినియోగాన్ని రెండు కప్పులకు పెంచడం వల్ల, అత్యంత సాధారణ కాలేయ క్యాన్సర్ రకమైన 'హెపటోసెల్యులర్ కార్సినోమా' వచ్చే ప్రమాదం సుమారు 35 శాతం తగ్గుతుందని అధ్యయనం పేర్కొంది. మద్యపానం, హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్, బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×) వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఈ ఫలితాలు సానుకూలంగానే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.రాత్రి సరిపడా నిద్రపోయిున, పగటిపూట మళ్లీ నిద్ర వస్తోందా? - కారణాలు ఇవే కావచ్చుట!కాఫీ కాలేయ క్యాన్సర్ ప్రమాదాన్ని ఎలా తగ్గిస్తుంది? : కాఫీ అనేది కేవలం కెఫీన్ ఉన్న పానీయం మాత్రమే కాదు. ఇందులో పాలీఫెనాల్స్, డైటెర్పెనెస్, సహజ యాంటీ ఆక్సిడెంట్లతో సహా వెయ్యికి పైగా జీవక్రియలకు ఉపయోగపడే సమ్మేళనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. ఈ సమ్మేళనాలు వాపును తగ్గించగలవని, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను నిరోధించగలవని చెబుతున్నారు. అంతేకాదు, లివర్ ఫైబ్రోసిస్ అభివృద్ధిని నెమ్మదింపజేయగలవని, లివర్ ఎంజైమ్ స్థాయిలను మెరుగుపరుస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఫలితంగా, కాలేయ వ్యాధులు తీవ్రమైతే వచ్చే 'సిర్రోసిస్', కాలేయ క్యాన్సర్ ప్రమాదాన్ని కాఫీ తగ్గిస్తుందట.పరిశోధనలు ఏమి చెబుతున్నాయి?1966 నుంచి 2007 మధ్య జరిగిన అధ్యయనాలపై ఆధారపడిన ఒక మెటా-విశ్లేషణ ప్రకారం, రోజుకు రెండు కప్పుల కాఫీ తాగడం వల్ల కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం 43% తగ్గుతుందని రోజుకు రెండు కప్పుల కెఫీన్ ఉన్న కాఫీ తాగడం వల్ల ఎజజ ప్రమాదం 27% తగ్గగా, అదే పరిమాణంలో కెఫీన్ లేని కాఫీ తాగడం వల్ల ప్రమాదం 14% తగ్గిందని దీవీజీ ఎంత కాఫీ తాగాలి? : ఎంత తాగాలి అనేదానిపై అంతర్జాతీయంగా ఒకే విధమైన సిఫార్సు లేనప్పటికీ, మితంగా తీసుకోవడం వల్ల స్పష్టమైన ప్రయోజనాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. రోజుకు రెండు నుంచి నాలుగు కప్పులు తాగితే ఆరోగ్యానికి మంచిదంటున్నారు. ఈ క్రమంలో ఫిల్టర్ కాఫీ అయినా, ఇన్‌స్టంట్ కాఫీ అయినా ఫలితం ఒకేలా ఉంటుందని అంటున్నారు. అయితే, అతిగా తీసుకోవడం వల్ల జీర్ణక్రియలో అసౌకర్యం, నిద్రలేమి లేదా గుండె వేగం పెరగడం వంటి దుష్ప్రభావాలు కలగవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇవి వ్యక్తిగత సున్నితత్వంపై ఆధారపడి ఉంటాయని తెలియజేస్తున్నారు. మొత్తంగా చెప్పాలంటే, మితంగా కాఫీ తాగడం అనేది కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక సులభమైన మార్గంగా పరిశోధనలు సూచిస్తున్నాయి.ఈ జాగ్రత్తలు తప్పనిసరట :మద్యపానం, ధూమపానం : లివర్? ఆరోగ్యం కోసం కాఫీ తాగుతున్నాం కదా అని మద్యపానం, ధూమపానం వంటివి కొనసాగిస్తే ఎలాంటి ప్రయోజనమూ ఉండదంటున్నారు నిపుణులు. కాఫీ వీటికి ప్రత్యామ్నాయం కాదని చెబుతున్నారు.వైద్య సలహా : గుండె సమస్యలు, తీవ్రమైన ఆందోళన, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు లేదా గర్భిణులు కాఫీ విషయంలో డాక్టర్ల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.జీవనశైలి : ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, సరైన బరువు మెయింటెయిన్ చేస్తూ, రెగ్యులర్?గా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. ఇవన్నీ చేస్తూ కాఫీ తాగితే ఒక అదనపు రక్షణగా ఉంటుందని, అలానే భావించాలని సలహా ఇస్తున్నారు.చీఉజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# దంపతుల మధ్య కోపతాపాలు తగ్గాలంటే! - ఈ టిప్స్ పాటించాలంటున్న నిపుణులు!



వైవాహిక జీవితంలో కోపతాపాలు, అలకలు సహజం. అయితే, ఇవి టీకప్పులో తుపానులా సమసిపోతేనే బాగుంటుంది. హద్దు దాటితే మాత్రం బంధానికే ముప్పు వాటిల్లో ప్రమాదం ఉంటుంది. అందుకే, నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. భాగస్వామి కోపంతో ఉన్నప్పుడు వాళ్ల దగ్గర కొన్ని విషయాలను అస్సలు ప్రస్తావించకూడదని సూచిస్తున్నారు. ఈ టిప్స్ పాటిస్తే దాంపత్య బంధం ఆనందంగా సాగుతుందని చెబుతున్నారు. మరి, ఆ విషయాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!నీ వల్ల కాదు : గొడవ జరిగినప్పుడు భార్యాభర్తలిద్దరూ ఒకరిపై ఒకరు పీకల్లోతు కోపంతో ఉంటారు. ఇలాంటప్పుడు ఎదుటివారిలో ఉండే ప్రతికూలతలు, లోపాలన్నీ గుర్తుకొస్తుంటాయి. ఒక రకమైన అసహనానికి లోనవుతుంటారు. 'నీ వల్ల ఏదీ కాదు', 'నువ్వెప్పుడూ నన్ను సంతోషంగా ఉంచలేదు', 'నీకు స్వార్థం ఎక్కువ' ఇలాంటి మాటలు మన ప్రమేయం లేకుండానే దొర్లుతుంటాయి. కానీ, ఇలాంటి మాటలు అవతలి వారి కోపాన్ని మరింతగా పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తద్వారా గొడవ పెద్దదవడం తప్ప మరే ప్రయోజనమూ ఉండదని చెబుతున్నారు. దీంతో ఇద్దరి మధ్యా ఒక్క రోజులో ముగిసిపోయే కోపతాపాలు, రోజుల తరబడి కొనసాగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే, కోపంతో ఉన్న భాగస్వామి దగ్గర ఎంత సంయమనం పాటిస్తే అంత మంచిదని సూచిస్తున్నారు. ఈ క్రమంలో తప్పైనా, ఒప్పైనా అవతలి వారి కోపం తగ్గే దాకా కామ్‌గా ఉండడం మేలని సలహా ఇస్తున్నారు. ఇక కూల్ అయ్యాక అన్ని విషయాలూ కూర్చొని మాట్లాడుకుంటే సరిపోతందని తెలియజేస్తున్నారు." డబ్బులు ఊరికే రావు" ఇలా చేశారంటే మీ టూర్ ప్లాన్ సక్సెస్ - నిపుణులు సూచిస్తున్న చిట్కాలివే!వాళ్ల ప్రస్తావన వద్దు : దంపతుల మధ్య జరిగే గొడవల్లో ఎక్కువ శాతం మూడో వ్యక్తి ప్రస్తావన వల్లే జరుగుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎలాగంటే, భార్యాభర్తలు తమ గొడవల మధ్యలో అత్తింటి వారి ప్రస్తావన తీసుకురావడం, వారిని విమర్శించడం చేస్తుంటారు. దీని వల్ల భాగస్వామి కోపం కట్టలు తెంచుకునే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇది దంపతుల మధ్య భేదాభిప్రాయాల్ని మరింతగా పెంచచ్చని అంటున్నారు. కాబట్టి, ఆలుమగలు మధ్య గొడవలుంటే వారే పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు. అంతేకానీ, అన్నింటికీ కారణం మూడో వ్యక్తే అని నిందించడం వల్ల దంపతుల మధ్య అనుబంధం దెబ్బతింటుందని పేర్కొంటున్నారు.రెచ్చగొడుతున్నారా? : అసలే గొడవై భార్యాభర్తల మధ్య దూరం పెరిగినప్పుడు.. దాన్ని పరిష్కరించకుండా, కొంతమంది అవతలి వారిని మరింత రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుంటారు. మాటలు, చేతలతో వాళ్ల సహనాన్ని పరీక్షిస్తుంటారు. ఈ క్రమంలో వాళ్లకు నచ్చని పనులు చేయడం, నచ్చని వ్యక్తులతో మాట్లాడడం లాంటివి చేస్తుంటారు. నిజానికి, ఇది గొడవకు పరిష్కారం చూపడమేమోగానీ, ఇద్దరి మధ్య దూరం మరింత పెరిగేలా చేస్తుందంటున్నారు నిపుణులు. కాబట్టి, కోపంలో ఉన్న భాగస్వామిని శాంతపరిచేందుకు ప్రయత్నించాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఓ మెట్టు దిగాలని చెబుతున్నారు.

# ఊరూరు తిరుగుతూ తన కల్యాణానికి తానే పిలుపునిచ్చే నరసింహ స్వామి- అహోబిలం బ్రహ్మోత్సవాల విశేషాలివే!



కృత యుగంలో హిరణ్యకశ్యపుని సంహారం కోసం శ్రీ మహావిష్ణువు ఉగ్ర నరసింహ అవతారం దాల్చిన సంగతి తెలిసిందే! రాక్షస సంహారం తర్వాత నరసింహ స్వామి కొలువైన క్షేత్రం అహోబిలం నవ నారసింహ క్షేత్రాలలో ఒకటైన పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. అహోబిలం నల్లమల్ల అడవి ప్రాంతంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొలువై ఉన్న దివ్య ధామం. ఫిబ్రవరి 20 నుంచి అహోబిలం నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ క్రతువులో జరిగే కల్యాణానికి స్వామి వారు ఊరూరు తిరుగుతూ తన పెళ్ళికి తానే పెళ్ళిపిలుపు అందించనున్నారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఉత్సవాలైన పార్వేట ఉత్సవం, అహోబిలం స్వామి వారి కళ్యాణం విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.అహోబిలం క్షేత్ర విశిష్టతనవ నారసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రాశస్త్యం పొందిన అహోబిలం 108 దివ్యదేశాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. పురాణాల ప్రకారం శ్రీ మహావిష్ణువు రాక్షస రాజైన హిరణ్యకశ్యపుని సంహరించేందుకు సగం మనిషిగా ఇంకో సగం సింహం రూపంలో అవతరించడంతో స్వామి ఉగ్ర రూపాన్ని చూసి దేవతలు అహో! ఏమి బలం!, అహోబలం! అని ఆశ్చర్యంతో పొగిడారంట! అందుకే ఈ క్షేత్రానికి అహోబిలం నరసింహ స్వామి దేవాలయంగా పేరు వచ్చింది అని చెబుతారు. ప్రతీ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ సందర్భంగా నరసింహుని పార్వేట ఉత్సవం 45 రోజుల పాటు కన్నుల పండుగగా జరుగుతుంది.

పార్వేట ఉత్సవం చరిత్ర'పరి' అంటే గుర్రం. స్వామి వారు క్రూరమృగాల్ని వేటాడడానికి గుర్రంపై అరణ్యాలకు బయల్దేరడాన్ని 'పారువేట' అంటారు. మరోవిధంగా, దుష్టశిక్షణ, శిష్టరక్షణకు దేవదేవుడు సాగించే పర్యటననే పార్వేట ఉత్సవం అని అంటారు. పూర్వం అహోబిలం మఠం ప్రథమ పీఠాధిపతితో స్వామి వారు "నన్ను గ్రామ గ్రామానికి తీసుకెళ్లండి. భక్తులకు నా పాదాలు ఆశ్రయించే అవకాశం కల్పించండి' అని ఆదేశించారని, అలాగే నా పెళ్లికి నా భక్తుల్ని నేనే స్వయంగా ఆహ్వానిస్తానని" కూడా చెప్పినట్లుగా అహోబిలం క్షేత్ర మహత్యంలో వివరించి ఉంది. స్వామివారి ఆదేశం మేరకు అహోబిలం మఠం ప్రథమ పీఠాధిపతి శఠగోపం యతీంద్ర మహాదేశికన్ ఈ బృహత్కార్యానికి శ్రీకారం చుట్టాడు. ఆనాటి నుంచి నేటి వరకు పార్వేట ఉత్సవాలు 45 రోజుల పాటు 35 గ్రామాల్లో వైభవంగా జరుగుతాయి. పార్వేటోత్సవాలకు కొనసాగింపుగా బ్రహ్మోత్సవాలు చివరగా జరిగే గరుడోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

పార్వేటోత్సవాల వెనుక ఇతిహాస గాథ

హిరణ్యకశ్యపుని సంహారం తరువాత నరసింహ స్వామి వీరావేశంతో నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తుంటాడు. ఎంతకూ ఆయన ఉగ్రత తగ్గదు. ఆ సమయంలో నరహరికి చెంచులక్ష్మి తారసపడింది. ఆమెను చూడగానే స్వామి ప్రసన్నుడవుతాడు. ఆమెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుంటాడు. అయితే చెంచులు తమ ఆడబిడ్డను వివాహం చేసుకోవాలంటే 'ఓలి'గా అంటే కట్నంగా ఏమి సమర్పిస్తావని స్వామిని అడుగుతారు. అప్పుడు స్వామి పారువేటు ఉత్సవాల్లో భక్తులు సమర్పించే ధాన్యాన్ని కట్నంగా ఇస్తానని హామీ ఇచ్చి చెంచులక్ష్మిని వివాహమాడతాడు. అలా చెంచులక్ష్మిని వివాహం చేసుకోవడానికి స్వామి గుర్రమెక్కి పార్వేటోత్సవాలలో గ్రామాలు తిరిగి భక్తులు సమర్పించే ధాన్యాన్ని స్వీకరించడం ఆనవాయితీగా వచ్చింది. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతుండడం విశేషం. అలా ఓలి కోసం స్వామి గ్రామాలు తిరుగుతూ తన పెళ్లికి గ్రామస్థులను స్వయంగా ఆహ్వానించడం కూడా ఈ పార్వేటు ఉత్సవంలో భాగం.పారువేటోత్సవాల శోభస్వామి పారువేటోత్సవాలకు వచ్చే గ్రామాలలో తెలుపుకు ప్రాధాన్యం ఉంటుంది. గ్రామాల్లో ఈ 45 రోజులు ఎటు చూసినా శ్వేత వర్ణం దర్శనమిస్తుంది. పారువేట ఉత్సవాలలో భాగంగా స్వామివారి పల్లకి ఎగువ అహోబిలం నుంచి కిందకు దిగుతుంది. బాచేపల్లిలో ప్రారంభమయ్యే ఈ ఉత్సవం రుద్రవరం గ్రామానికి చేరడంతో ముగుస్తుంది. స్వామి పారువేట వేడుకలు జరిగే 45 రోజులు గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంటుంది. స్వామి తమ ఊరికి వచ్చాడని గ్రామ ప్రజల్లో పట్టరాని ఆనందం అవధులు దాటుతుంది. దాదాపు 600 సంవత్సరాలుగా ఈ ఉత్సవం నిరాటంకంగా కొనసాగడం స్వామి మహిమే అని స్థానిక ప్రజలు భక్తిపారవశ్యంతో చెబుతారు. ఈ సందర్భంగా స్వామి పల్లకి మోయడానికి భక్తులు పోటీపడతారు. ఎంత పెద్ద ఉన్నతాధికారైనా సరే నిమిషం కాలమైనా స్వామి పల్లకి మోయాలని తహతహలాడుతారు.రానున్న అహోబిలం నరసింహుని పార్వేట ఉత్సవాల్లో పాల్గొనడానికి మనం కూడా తరలి వెళ్దాం. స్వామివారి కల్యాణాన్ని కన్నులారా వీక్షిద్దాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# తరిగొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు- పూర్తి వివరాలు మీ కోసం!





ఫాల్గుణ మాసంలో ప్రతి నరసింహ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఒకటి రెండు రోజుల తేడాతో దాదాపు అన్ని నరసింహ క్షేత్రాల్లో ఇదే మాసంలో బ్రహ్మోత్సవాలు జరగడం విశేషం. ఇప్పటికే ఇటు యాదగిరి గుట్ట, అటు అహోబిలంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తరిగొండ నరసింహ స్వామి క్షేత్రంలో కూడా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరగనున్న ఈ బ్రహ్మోత్సవాలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి? ఏ రోజు ఏ ఉత్సవం జరగనుంది తెలుసుకునే ముందు తరిగొండ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ విశేషాలు కూడా ఈ కథనంలో తెలుసుకుందాం.పెరుగు కుండలో దర్శనమిచ్చిన నరసింహుడు

ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాలో శ్రీ తరిగొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వెలసి ఉంది. పూర్వం తరిగొండ ప్రాంతాన్ని 'తరికుండ' అని పిలిచేవారు. ద్రవిడ భాషలో 'తైర్' అంటే పెరుగు అని అర్థం. పూర్వం ఈ గ్రామంలోని ఓ స్త్రీ పెరుగు చిలుకుతున్నప్పుడు పెరుగు కుండలో సాలగ్రామ రూపంలో లక్ష్మి నరసింహ స్వామి దర్శనమిచ్చాడంట! అదే సమయంలో ఆ గ్రామంలో నివసించే ఒక భక్తునికి స్వామి కలలో సాక్షాత్కారమిచ్చి తనకు ఆలయం నిర్మించి పెరుగు కుండలో దొరికిన తన సాలగ్రామాన్ని ప్రతిష్ఠించమని చెప్పాడంట! స్వామి ఆదేశం మేరకు నిర్మితమైన ఈ ఆలయంలో శ్రీలక్ష్మి నరసింహ స్వామి స్వయంభువుగా పూజలందుకుంటున్నాడు. 'తరికుండ' కాలక్రమేణా తరిగొండ గా మారింది.సత్యపీఠంతరిగొండ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో దుర్వాస మహర్షి సత్య పీఠాన్ని ఏర్పాటు చేసాడని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. నరసింహ స్వామి ఆలయం వెలుపల స్వామికి ఎదురుగా ఉన్న ఈ బలిపీఠం వద్ద ఎంత ఘోరమైన నేరాలు చేసిన వారైనా సరే తమ తప్పును ఒప్పుకొని తీరాల్సిందే! అందుకే తప్పు చేసినవారు ఇక్కడ ప్రమాణాలు చేయడానికి భయపడతారు. కాణిపాకంలో వలే తరిగొండ క్షేత్రం కూడ సత్య ప్రమాణాలకు నెలవుగా మారింది.

బ్రహ్మోత్సవాలుతరిగొండలో ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసం శుద్ధ సప్తమి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 23, సోమవారం నుంచి మార్చి 4, బుధవారం వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏ రోజు ఏ ఉత్సవం జరుగనుందో తెలుసుకుందాం.

బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్

23 ఫిబ్రవరి సోమవారం అంకురార్పణ కార్యక్రమం జరుగుతుంది.

24, ఫిబ్రవరి మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది, రాత్రి హంస వాహన సేవ జరుగనుంది.

25, ఫిబ్రవరి బుధవారం ఉదయం ముత్యపుపందిరి వాహనం, రాత్రి హనుమంత వాహన సేవలు జరగనున్నాయి.

26, ఫిబ్రవరి గురువారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సింహ వాహన సేవలు జరగనున్నాయి.

27, ఫిబ్రవరి శుక్రవారం ఉదయం బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి పెద్దశేష వాహనసేవలు జరుగనున్నాయి.

28, ఫిబ్రవరి శనివారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి గరుడ వాహన సేవలు జరుగనున్నాయి.

మార్చి 1, ఆదివారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం జరుగుతుంది. తిరిగి సాయంత్రం కల్యాణోత్సవం జరుగుతుంది.

మార్చి 2, సోమవారం ఉదయం రథోత్సవం, రాత్రి ధూళి ఉత్సవం జరుగుతుంది.

మార్చి 3, మంగళవారం ఉదయం రథోత్సవం జరుగుతుంది. ఈ రోజు రాత్రి చంద్ర గ్రహణం కారణంగా ఉత్సవ నిర్వహణ జరగకపోవచ్చు.

మార్చి 4, బుధవారం ఉదయం వసంతోత్సవం అనంతరం చక్రస్నానం జరుగుతాయి. అదే రోజు రాత్రి జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

తరిగొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు మనం కూడా తరలి వెళ్దాం. బ్రహ్మోత్సవ వైభవాన్ని కళ్లారా వీక్షిద్దాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాలలో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలి !

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అడపాదడపా గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను పట్టుకుంటున్నా. .అదేమంత పెద్ద మొత్తంలో కాదని తెలుస్తోంది. చాపకింద నీరులా ఈ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విస్తరిస్తోంది. రోజూ ఎక్కడోచోట దాడుల్లో మత్తు పదార్థాలను పట్టుకుంటూనే ఉన్నారు. అయినా రవాణా ఆగడం లేదు. దొరికిన వారిని ఎన్‌కౌంటర్ చేస్తే తప్ప రవాణా ఆగదేమో అన్న ఆందోళన కలుగుతోంది. నిరుద్యోగులు దీనిని ఓ ఉపాధిగా ఎంచుకోవడం వల్లనే రవాణా సులభంగా మారింది. దీనికితోడు దీంతో డబ్బులు కూడా బాగా రావడంతో యువత దీనిని ఉపాధిగా ఎంచుకుని ఈ ఉచ్చులో దిగుతున్నారు. దీనికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టాల్సి ఉంది. యువత పెడమార్గం పట్టకుండా వారికి ఉపాధి చూపాలి. స్కూలుస్థాయిలోనే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. కాలేజీల్లో నిఘా పెంచాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా పరిస్థితికి అడ్డుకట్ట పడడం లేదు. ముఖ్యంగా యువత మత్తుకు అలవాటు పడి దుర్మర్గాలకు దిగుతున్నారు. మత్తు మనిషిలోని విచక్షణను హరించి వేస్తోంది. ఎలాంటి దారుణాలకు దారి తీస్తుందో చెప్పటానికి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఇటీవల జరిగిన బాలిక హత్యాచార దుర్మార్గం ఓ హెచ్చరిక కావాలి. ఇదొక్కటే కాదు ఇలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నాయి. మత్తులో ఓ మైనార్ బాలికను కొందరు సామూహిక అత్యాచచరం చేసారు. అభంశుభం తెలియని పసిపాపను చిదిమేసిన ఘటనలో కులవర్ధన్ అనే దుర్మార్గుడు ఆత్మహత్ చేసుకున్నా సంతోషించడానికి లేదు. నెల్లూరు నగరంలో పట్టపగలే అందరూ చూస్తుండగానే– పెంచలయ్య అనే ప్రజాకళాకారుడిని గంజాయి మూక పొట్టన పెట్టుకొంది. నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ సౌమ్యను ఈ ఏడాది జనవరిలో మత్తు మాఫియా కారుతో గుద్ది, ప్రాణాలు బలిగొంది. గంజాయికి అలవాటు పడ్డ ముఠాలు హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న దారుణ ఉదంతాలు తరచూ చూస్తూనే ఉన్నాం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అంటకాగుతూ ఈ ముఠాలు తమ దౌర్జన్యాలను చెలాయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. పైపై చర్యలతో ఈ గంజాయి సామ్రాజ్యం నశించిపోదని గ్రహించాలి. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఖచ్చితమైన కార్యాచరణ రూపొందించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో సంబంధం ఉన్న ముఠాలను పార్టీల నుంచి వెలివేయాలి. రాజకీయ దన్నుతో విర్రవీగుతున్న గంజాయి సామ్రాజ్యాన్ని సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా ఒంటరిపాటు చేసినప్పుడే దాని నియంత్రణ, నిర్మూలన సాధ్యమవుతుంది. ఈ ఘటన యువతలో మార్పు తీసుకుని వస్తుందని అనుకోవడం భ్రమే అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాదక ద్రవ్యాల విచ్చలవిడి వినియోగం ఆందోళన కలిగించేలా ఉంది. దాని నియంత్రణకు,నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా లాభం లేకుండా పోతోంది. ఉభయ తెలుగు రాస్ట్రాల్లో వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వరుసపెట్టి ఈ తరహా దారుణాలు జరుగు తున్నందుకు కఠిన చర్యలు తీసుకోకపోవటం క్షంతవ్యం కాదు. వరుసగా జరుగుతున్న చాలా నేరాల వెనుక మత్తు, మాదకద్రవ్యాలు విపరీతంగా పనిచేస్తున్నాయని ప్రభుత్వాలు గుర్తించాలి. నిందితుల ప్రాణాలు తీసేస్తోనో, జైల్లో వేస్తోనే, లేదా వారే తీసుకుంటేనో ఈ సమస్యకు పరిష్కారం దక్కదు. విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల రవాణాను సవాల్‌గా తీసుకోవాలి. కూకటివేళ్లతో సహా పెకలించాలి. దానికి నిరంతరమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ప్రభుత్వాలు నిచేయాలి. అవసరమైతే ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. ఇటీవల కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. పన్నెండేళ్ల వయసు పిల్లలు మొదలుకొని యువకుల వరకూ ఎక్కువగా వినియోగిస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను వ్యర్థం చేసుకుంటున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. మత్తు బానిసలను ఆ ఊబి



నుంచి బయటకు తెచ్చే వైద్యానికే దేశంలో ఏటా రూ.15 వేల కోట్ల ఖర్చవుతుందని ఒక అంచనా. చికిత్సకు వెళ్లకుండానే కొందరు మత్తులనే కుప్పకూలి పోతున్నవారు దేశంలో 2003 – 2013 మధ్య పోలీసు తనిఖీల్లో రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కేజీల మాదకద్రవ్యాలు పట్టుబడితే– తరువాతి పదేళ్ల కాలంలో అంటే 2014 – 2025 మధ్య కాలంలో రూ.1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు దొరికాయి. విచ్చలవిడిగా పెరుగుతున్న మత్తు ద్రవ్యాల వినియోగానికి ఈ గణాంకాలు ఒక ఉదాహరణ. దొరికిన మాదకద్రవ్యాలే ఇంత పెద్దఎత్తున ఉంటే దేశమంతా విస్తరించి వినియోగమైనది ఎంత ఉంటుందో ఊహించవొచ్చు! మాదకద్రవ్య వినియోగం తొలుత సరదాగా మొదలై, ఉత్తేజం ఇస్తున్నట్టుగా అనిపించి, తరువాత మనిషి సర్వ శారీరక వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుంది. మత్తుకు బానిసయ్యేలా మార్చేసి, విచక్షణను, వివేచనను చంపేస్తుంది. సామాజిక కట్టుబాట్లను,
నాగరిక విలువలను కాలదన్ని, మనిషిని మృగంలా మార్చేస్తుంది. ఫలితంగా తీవ్రమైన నేరాలూ, దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మాదకద్రవ్యాల కారణంగా ఎన్నో కుటుంబాలు అస్తవ్యస్త మవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియాన్స్ వీసా గడవువ ముగిసినా ఇక్డే తిష్టవేసి మత్తు వ్యాపారం చేస్తున్నారు. వీరిని ముందుగా గుర్తించాలి. మత్తు పదార్థాల రవాణను అరికట్టేందుకు ఆపరేషన్ చేపట్టాల్సిందే. ఇందుకోసం పెద్ద ఎత్తున బలగాలను వినియోగించాలి. యువతను కాపాడుకోవడానికి ఎంత కఠినమైన చర్యలకైనా వెనకాడరాదు.

---


# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

**సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం**

**మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి**

**అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల**

**వాషింగ్టన్,ఫిబ్రవరి23:** దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం–1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ పక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ



చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళు తుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ పక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్ది దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4–10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

---

# వైభవంగా సాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు



**- గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు**

**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి23:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం యాదగిరీశుడిని 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో భక్తులు సేవించారు. భక్తజన రక్షణెళి ధ్యేయంగా అవతారాలు దాల్చిన స్వామివారు ప్రకృతి బీభత్సం నుంచి కాపాడే భక్తజన బాంధవుడిగా శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింబించే అలంకరణలో దివ్య మనోహరంగా భక్తజనులకు దర్శనమిచ్చారు. తన చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టి గోపాలులను రక్షించిన మహిమలను అర్చకులు అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు.భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. ఉత్సవాలను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు సింహా వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

---

# తిరుమలలో నాకాబందీ

**విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు**

**ఆరు ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు**


**తిరుమల,ఫిబ్రవరి23:** తిరుమలలో యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. తిరుమల డీఎస్పీ పర్యవేక్షణలో బాలాజీ నగర్ ప్రాంతంలో విస్తృత స్థాయి నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్, ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఫైర్ శాఖ, టీటీడీ రెవెన్యూ, రెవెన్యూ శాఖ, బిడి టీమ్స్, ఎక్సైజ్ శాఖ, హెల్త్ శాఖలకు చెందిన సుమారు 90 మంది సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 6 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో బాలాజీ నగర్ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా టీటీడీ కేటాయించిన నివాసాల్లో అనుమతిపొందిన వ్యక్తులే ఉంటున్నారా లేదా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా నివసిస్తున్నారా అనే కోణంలో పరిశీలన చేపట్టబడింది. ప్రతి విభాగం వారు తమ తమ శాఖలకు సంబంధించిన అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ నాఖాబందీ కార్యక్రమంలో మొత్తం 820 ఇళ్లను తనిఖీ చేయగా, సరైన గుర్తింపు కార్డులు లేని 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకు న్నారు. అలాగే గుర్తింపు పత్రాలు లేని 11 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు



అధికారులు స్థానికులతో సమావేశమై, తమ ఇళ్లను అపరిచిత వ్యక్తులకు బాడుగకు ఇవ్వవద్దని, సరైన గుర్తింపు లేకుండా ఎవరినీ పనులకు నియమించవద్దని సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. స్థానిక నివాసులు ఈ నాఖాబందీ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకారం అందించగా, తిరుమలలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ, ఆదేశాల మేరకు, తిరుమల అదనపు ఎస్పీ సూచనలతో ఈ తనిఖీలు చేపట్టారు.

# రాందాస్ పేటలో 'గ్రావెల్' మాఫియా అరాచకం: నిద్రపోతున్నారా అధికారులు?

**NH 44 సాక్షిగా... రాందాస్ పేట గుట్టల నిలువు దోపిడీ!**



**గార్లదిన్నె, ఫిబ్రవరి 23** :రామదాస్ పేట పరిసరాల్లో, ముఖ్యంగా NH 44 (జాతీయ రహదారి 44) సమీపంలోని గుట్టలను అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. అధికారుల కళ్లు గప్పి కాదు... అధికారుల కళ్ల ముందే ఈ అరాచకం సాగుతోంది!గుట్టలను పిండి చేయడానికి భారీ హిటాచీలను రంగంలోకి దింపారు. ఒక జెసిబి (JCB) తో ఎర్రమట్టిని తవ్వుతూ, హిటాచీల సహాయంతో నిరంతరం మట్టిని తరలిస్తూ ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నారు.జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్నా, మైనింగ్ మరియు రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న "మామూళ్ల" కథ ఏంటి?కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ మట్టి మాఫియా చెలరేగిపోతోంది. చట్టం అంటే భయం లేకుండా సాగుతున్న ఈ దోపిడీకి అడ్డుకట్ట వేసే నాథుడే లేడా?ప్రభుత్వ భూమిని, ప్రకృతిని దోచుకుంటున్న ఈ అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి మీకు వస్తున్న అభ్యంతరం ఏమిటి? సామాన్యుడికి ఒక న్యాయం, ఈ మట్టి మాఫియాకు ఒక న్యాయమా? రాజకీయ ఒత్తిళ్లకు లొంగి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తారా??"అధికారులారా... ఇప్పటికైనా కళ్లు తెరవండి! NH 44 సమీపంలోని గుట్టలను కాపాడండి. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. ఈ దోపిడీకి ముగింపు పలకాల్సిందే!"

# అనుమానాస్పద స్థితిలో గంపనపల్లె విద్యార్థిని పవిత్ర మృతి

**మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు**



**రామసముద్రం, ఫిబ్రవరి 23**రామసముద్రం మండలం పూలపాడు గ్రామపంచాయతీ గంపన పల్లి గ్రామానికి చెందిన బసవరాజు, భారతమ్మలకు ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు, మొదటి కుమార్తె చైత్ర బెంగళూరులో బీటెక్ చదువుతోంది. రెండవ కుమార్తె పవిత్ర రేణిగుంట, గాజుల మండ్యంలోని నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ సెకండియర్ ఎంపిసి చదువుతోంది. అయితే 20వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు కాలేజీ నుండి వార్డెన్ నెంబర్ తో పవిత్ర తల్లిదండ్రులకు ఫోన్ చేసి నాకు జ్వరంగా ఉందని చెప్పడంతో వారు ఆసుపత్రికి వెళ్ళమని చెప్పి రేణిగుంటలో పద్మావతి హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్న పవిత్ర చికిత్సఅవసరాల కోసం కాలేజ్ వార్డెన్ కు 500 రూపాయలు,ఆటో కి 400 రూపాయలు ఫోన్ పే ద్వారా పంపించామని అన్నారు.22వ తేది మళ్లీ నారాయణ కాలేజీ నుండి ఫోన్ చేసి మీ కుమార్తెకు జ్వరం ఎక్కువ అవ్వడంతో ఇంజక్షన్ వేసిన చోట బొబ్బలు ఎక్కువగా వస్తున్నాయి అని చెప్పడంతో వారు హుటాహుటిన ఇంటి నుండి బయలుదేరి నారాయణ కాలేజీ క్యాంపస్ లోకి వెళ్లి చూడగా మీ కుమార్తె మృతి చెందిందని వారు చెప్పడంతో పవిత్ర మృతి పట్ల విద్యార్థిని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తూ సదరు గాజుల మండ్యంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీస్ వారు కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

## ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గోపాల పురం పోలీస్ స్టేషన్ లో విధి నిర్వహణలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక భరోసా చెక్ ను అంద చేసిన ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్.



**ఏలూరు, ఫిబ్రవరి 23.** పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు, గోపాలపురం పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ హెచ్ జి 227గా విధులు నిర్వహిస్తూ, గత నెల 26-01-2025న అకస్మికంగా మరణించిన డి. మధుసూధన్ కుటుంబానికి సొసైటీ అండగా నిలిచింది. వారి మృతి పోలీస్ శాఖకు తీరని లోటని, ఒక నిబద్ధత గల అధికారిని కోల్పోవడం బాధాకరమని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.మధుసూధన్ అకాల మరణం దృష్ట్యా, పోలీస్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా వారికి అంద వలసిన ప్రయోజ నాలను ఈరోజు అనగా 23.02.2026 వ తేది న వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ గారు అంద చేసినారు.ఆర్థిక సహాయం వివరాలు మొత్తం చెల్లింపు: రూ. 1,35,661/- (అక్షరాలా: ఒక లక్ష ముప్పై ఐదు వేల ఆరు వందల అరవై ఒక రూపాయలు).ఇందులో మధుసూధన్ గారి షేర్ క్యాపిటల్, థ్రిఫ్ట్ మరియు థ్రిఫ్ట్‌పై వచ్చిన వడ్డీ కలిసి ఉన్నాయి. ఎస్‌బీఐ (ఎస్ బి ఐ ) చెక్ రూపంలో అందజేత.ఈ చెక్కును కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ చేతుల మీదుగా మధుసూధన్ సతీమణి శ్రీమతి కె. సంధ్య గారికి అందజేశారు.ఈ సందర్భంగా కిషోర్ మాట్లా డుతూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, పోలీస్ ఉద్యోగుల సహకార సంఘం ఎల్లప్పుడూ తన సభ్యుల కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాస రావు అకౌంటెంట్ అబ్దుల్ అలీమ్ ప్రతినిధులు మరియు మధుసూధన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెం మాజీ టిడిపి మండల అధ్యక్షులు షేక్ ముస్తఫా కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు కేఎస్. జవహర్.



**ఏలూరు జిల్లా :**
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ వాక్ఫ్ బోర్డు చైర్మన్ పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు అయిన షేక్ ముస్తఫా తల్లి షేక్ సుఫియా బేగం ఇటీవల మృతి చెందారు. షేక్ ముస్తఫా ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ శ్రీ ఖూ జవహర్ పరమర్శించారు ముస్తఫా కి నాకు పార్టీలోకి వచ్చినప్పటి నుంచి మంచి సన్నిహితం ఉంది. అందువలన నేను వచ్చే ముస్తఫా అని పరామర్శించటమైనదని తెలిపారు. వారితోపాటు కొండ్రెడ్డి కిషోర్, తోటికుంట దుర్గారావు, బొబ్బర రాజ్ పాల్ కుమార్ గొల్లలమంద శ్రీనివాసరావు, లాగు ప్రకాష్ మద్దిపటి ఉదయ్ ఎడ్లపల్లి ఏడుకొండలు, కోనేటి చంటి, నిమ్మగడ్డ శ్రీనివాస్, పొదిలి ఫణి శర్మ, షేక్ అల్లావుద్దీన్, దివార్, పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

# పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లో అందిన అర్జీలు పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలి.

**అర్జీదారులు సమస్యలు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తేనే శాశ్వత పరిష్కారం అవుతాయి.**
**అర్జీదారులు సంతృప్తి పొందే స్థాయిలో ఫిర్యాదులు పరిష్కారం ఉండాలి.**
**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...**





**ఏలూరు, ఫిబ్రవరి 23** జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి జిల్లా స్థాయీ అధికారులతో నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర్, కెఆర్ సీసీ డిప్యూటీ కలెక్టరు యల్. దేవకిదేవి, జిల్లా సర్వే సహాయ సంచాలకులు అన్సారీ లు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు నుండి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని అన్నారు. ప్రజాసమస్యలు పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రజలు నుండి స్వీకరించిన అర్జీలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువు లోపుగానే నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే ఆయా శాఖలు అధికారులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలోకి అధికారులు వెళ్ళి లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.ఈ రోజు అందిన అర్జీలలో కొన్ని.భీమడోలు మండలం భోగాపురం నివాసి రేవులగడ్డ పౌలురాజు మాకు విద్యుత్తు స్తంభాలు వేశారు కాని విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వలేదని కరెంటు లేక పిల్లలతో చాలా ఇబ్బందులు పడుచున్నామని మాకు కరెంటు వచ్చేలా చూడగలరని కోరారు, ఏలూరు మండలం సత్రంపాడు నివాసి బట్టు ప్రేమవాణి నా భర్త గృహ హింస పెట్టుచున్నారు నాకు న్యాయం చెయ్యాలని కోరారు, వేలేరుపాడు మండలం రేపాకగుమ్మ నివాసి నల్లం శ్రీనివాస్ నా ఇల్లు ముంపుకు గురైంది నష్టపరిహారం మంజూరు అయింది కాని డబ్బులు జమకాలేదని డబ్బులు ఇప్పించాలని కోరారు, పెదవేగి మండలం వీరన్నపాలెం గ్రామ నివాసి వాయిల దుర్గమ్మ మా వీధిలో అయిదు మందికి ఇండ్లు మంజూరు అయ్యాయని స్లాబులు వరకు నిర్మించు కున్నామని మిగతా డబ్బులు మంజూరు చేస్తే గృహనిర్మాణాలు పూర్తి చేసుకుంటామని కోరారు, ఏలూరు అర్బన్ చేపలతూము సెంటరు బోట్ల సూరిబాబు ఇంటి స్థలం మంజూరు చేశారు సంతోషం ఇల్లు కట్టుకోవడానికి కూడా ఋణం కూడా మంజూరు చెయ్యాలని కోరారు, రెవిన్యూ క్లినిక్ లు మండలాలు వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసి స్వీకరించారు.వీటిలో భూసేకరణ సంబంధిత సమస్యలు, ఆర్ఓఆర్ పట్టాదారు పాసుపుస్తకాలు, రీసర్వేలో తేడాలు, రీ సర్వే తిరిగి చెయ్యాలని, తదితర ఇతర భూసమస్యలు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరేటు ఏవో యన్.వి. నాంచారయ్య, జిల్లా కలెక్టరేటు సూపర్డెంట్లు, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# పౌరసరఫరాల సేవల్లో సంస్కరణ బాట!!

**అసెంబ్లీ లో జరిగిన చర్చ సందర్భంగా సమాధానం ఇచ్చిన ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.**



**అమరావతి,ఫిబ్రవరి 23.** పౌరసరఫరాల సేవలను ఆదర్శవంతంగా ప్రజలకు అందజేయడమే కాకుండా, సేవల్లో గణనీయమైన సంస్కరణలను కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ గారు స్పష్టం చేశారు.వినియోగదారుల వ్యవహారాలు,
ఆహార, పౌరసరఫరాల శాఖ పనితీరుపై శాసనసభలో సభ్యులు లేవనెత్తిన చర్చ సందర్భంగా శ్రీ మనోహర్ గారు సమాధానం ఇస్తూ శాఖ పనితీరును వివరించారు. అలాగే మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత శాఖలో తీసుకువచ్చిన మార్పులు, సంస్కరణల గురించి ప్రస్తావించారు. వివరాలు ఆయన మాటల్లో...గతంలో మాదిరి కాకుండా రాష్ట్రంలో ఉన్న 1.45 రేషన్ కార్డుల లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందిస్తున్నాం. ఏటీఎం తరహాలో స్మార్ట్ రేషన్ కార్డు తీసుకువచ్చాం. క్యూఆర్ కోడ్ ద్వారా లబ్ధిదారుల సమస్త వివరాలు, సరకులు తీసుకున్న రికార్డు దానిలో పొందుపరుస్తున్నాం.గతంలో ఎన్నడూ లేనట్లుగా గత ఖరీఫ్ లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని, ఈ రోజు వరకు 45.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. మొత్తం 7,47,940 మంది రైతులకు రూ. 10,810 కోట్ల ధాన్యం బకాయిల సొమ్ము చెల్లించాం. దీనిలో 8 గంటల్లోపు రూ. 5,8333 కోట్లు ధాన్యం సొమ్ములు పడటం రికార్డు. 24 గంటల్లోపు 93 శాతం మందికి చెల్లింపులు పూర్తయ్యాయి. గతంలో ఎన్నడు లేని విధంగా 11 జిల్లాల్లో 100% ధాన్యం కొనుగోలు పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ రికార్డు. ప్రతి నెల ఒకటో తారీఖు కన్నా ముందే వికలాంగులు, వృద్ధులు ఉన్న 16.35 లక్షల కార్డులకు ఇంటింటికి వెళ్లి పౌరసరఫరాల సేవలను అందిస్తున్నాం.ఇంటింటికీ పౌరసరఫరాలు అనే పేరుతో గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తీసుకొొచ్చి విలువైన ప్రజాధనం వృధా చేసింది. ఆ వ్యవస్థను పూర్తిగా తొలగించి ప్రజాధనాన్ని ఆదా చేయడంతో పాటు పౌరసరఫరాల వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.ఆహార భద్రతలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి సూచనల మేరకు చిరు ధాన్యాలను పౌరసం ఫరాల దుకాణాల్లో పంపిణీ చేస్తున్నాం. మొదటగా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో రాగి, జొన్నలను అందజేస్తూ ప్రజల ఆహార భద్రతకు ప్రాధాన్యమిస్తున్నాం.భావితరాలకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్న భోజనం కింద పంపుతున్న బియ్యాన్ని 25 కేజీల బస్తాల్లో, నాణ్యమైన బియ్యాన్ని పంపుతున్నాం. మహిళల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రతి తెల్ల కార్డు ఉన్న కుటుంబానికి ఉచితంగా నాలుగు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం.ఇలా ఎన్నెన్నో వినూత్న సంస్కరణలను పౌరసరఫరాల శాఖలో తీసుకొచ్చాం. ప్రజల ఆహార భద్రతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చాం.

# వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు బడ్జెట్ లో 50% నిధులు కూటమిప్రభుత్వము

**కేటాయించి, రైతాంగాన్ని ఆదుకోవాలి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ డిమాండ్**





**అనంతపురం :** ఏపిరైతుసంఘము రాష్టసమితిపిలుపుమేరకుశింగనమలమండలతహశీల్దార్ కార్యాలయముదగ్గరనిరసనతదనంతరముడిప్యూటీతహశీల్దార్ సూర్యప్రతాప్, ఘాఅన్వేష్ గారికీ వినతిపత్రముఅందించి రైతుసంఘముజిల్లాఅధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ, ఏపిరాష్ట్ర ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ గారు ఫిబ్రవరి 14న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ రైతులను, కౌలు రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. మొత్తం రూ॥3.33 లక్షల కోట్ల బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి కేవలం 4.31% మాత్రమే కేటాయించడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధంగా ఉంది.ఈ నేపథ్యంలో ఒకసారిఈ క్రిందిప్రస్తుత బడ్జెట్లోని లోపాలు:చూడండి.నిధుల కోత: 'అన్నదాత సుఖీభవ' పథకానికి గతంలో 9,400 కోట్లు ఉండగా, ప్రస్తుతం 6,660కోట్లకు తగ్గించారు.కౌలు రైతుల విస్మరణ: రాష్ట్రంలో మెజారిటీ భూము లు సాగు చేస్తున్న కౌలు రైతుల ప్రస్తావనే ఈ బడ్జెట్లో లేకపోవడం గమనార్హం.నామమాత్రపు కేటాయింపులు: వడ్డీ రాయితీకి 2,000 కోట్లు అవసరమైతే కేవలం 250 కోట్లు, ధరల స్థిరీకరణ నిధికి 3,000 కోట్లు అవసరమైతే కేవలం 500 కోట్లు మాత్రమే కేటాయించారు.రక్షణ కవచం లేమి: ఉచిత పంటల బీమాను ఎత్తివేయడం, ప్రకృతి విపత్తుల సహాయ నిధికి నిధులు సున్నాగా ఉండటంవల్ల రైతులు అభద్రతకు గురవుతున్నారు. అనుబంధ రంగాల నిర్లక్ష్యం: పశుసంవర్ధక, మత్స్య, ఆక్వా, సెరికల్చర్ వంటి ఉపాధినిచ్చే రంగాలకు ఆశించినప్రాధాన్యత లభించలేదు .ప్రధాన డిమాండ్లు:రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగాలకు కనీసం 10% నిధులను కేటాయించాలి. గత మరియు ప్రస్తుత సంవత్సర బకాయిల కింద సుమారు 27,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలి.భూమి లేని కౌలు రైతులకు రావాల్సిన సుమారు 3,500 కోట్ల బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమఎన్నికల వాగ్దానం మేరకు నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలి.ధరల స్థిరీకరణకు ॥3,000 కోట్లు, వడ్డీ రాయితీకి ॥2,000 కోట్లు మరియు ఉచిత పంట బీమాకు 2,000 కోట్లు కేటాయించాలి.మైనర్ ఇరిగేషన్ పనులకు కనీసం 5,000 కోట్లు కేటాయించాలి. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలి.ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు తక్షణమే ఎక్స్ గ్రేషియా చెల్లించి వారిని ఆదుకోవాలి.కేంద్ర బడ్జెట్లో వ్యవసాయరంగానికి నిధులు పెంచేలా ఒత్తిడి తేవాలి. రాష్ట్రానికి వెన్నెముకైన రైతాంగం ఆర్థికంగా కుంగిపోకుండా వ్యవసాయముచతికలపడకుండా ఉండాలంటే ప్రభుత్వం ఈ అంశాలను పునఃపరిశీలించి, బడ్జెట్లో యాభై శాతము నిధులు కేటాయించాలని అంధ్రప్రదేశ్ రైతు సంఘము తరపునడిమాండ్.ఈ కార్యక్రమములో రైతుసంఘము నీయోజక వర్గఅధ్యక్షులు మధుయాదవ్, సీపీఐమండలసహయ కార్యదర్శి చికెన్ బాషా,రైతుసంఘముమండలఅధ్యక్షులు బయన్న, వ్యవసాయ కార్మిక సంఘముమండలఅధ్యక్షకార్యదర్శులు ఓబులపతి, మునిస్వామి, రూప్లానాయక్ ,జయరాంనాయక్, వేంకటేశ్వరరెడ్డి, అదెన్న,ప్రభాకర,రామాంజినేయులు,రామక్రిష్ణ,గోవిందు,కోనప్ప, చెన్నప్ప,తాతయ్య,మసూద్ .వలి,గమ్మాబాయి ,లక్ష్మిదేవి,దేవమ్మ, మునెప్ప,పెద్దన్న,రమణయ్య,నల్లప్ప,నాగయ్య పాల్గోనడమైనది.

## టీడీపీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర సీనియర్ ముఖ్యమంత్రివర్యులు ఎన్ .చంద్రబాబునాయుడు మాటను, పార్టీ అధిష్టానం గీసిన గీతను, దాటని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ని,ఏపీ నుండి రాజ్యసభకు పంపించాలి.



**ఏలూరు, ఫిబ్రవరి 23.** ప్రజా సంఘాల తరపున కూటమి ప్రభుత్వానికి , సీఎం చంద్రబాబు నాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, మీడియా ద్వారా అభ్యర్థిస్తున్నట్లు, జాతీయ మాదిగ సీనియర్ నేత, అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పొలిమేర హరికృష్ణ వెల్లడించారు స్థానిక "లివి గ్రాండ్ ఏసీ హాల్‌లిలో జరిగిన పాత్రికేయ సమావేశంలో హరికృష్ణ మాట్లాడుతూ.... మొదటిసారి గెలుపు అవకాశంతో రాజ్యసభకు నామినేషన్ వేయడానికి వెళ్లి, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వెనక్కి రావలసి వచ్చిందని,, రెండవసారి బలం లేకపోయినా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు, రాజ్యసభ బరిలో ఉన్నారని హరికృష్ణ గుర్తు చేశారు, ఏపీ నుంచి రానున్న నాలుగు రాజ్యసభ స్థానాలలోఒక స్థానశీ నుంచి వర్ల రామయ్య గారిని ఎంపిక చేసి, రాజ్యసభకు పంపించాలని, ప్రజా సంఘాల తరపున మనవి చేస్తున్నామని హరికృష్ణ చెప్పారు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బొబ్బరి ఎలీషా మాట్లాడుతూ... 2,1/2 దశబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్న వర్ల రామయ్య గారికి ఈ అవకాశం కల్పించాలని, సీఎం గారిని, డిప్యూటీ సీఎం గారిని, మంత్రి లోకేష్ గారిని కోరారు ఈ సమావేశంలో ఎస్సీ నాయకులు పరిసిపోగు బాలరాజు, దుగ్గినపల్లి రామకృష్ణ , బి. రామకృష్ణ, బి.నారాయణస్వామి, సిహెచ్. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లాఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాల పంపిణీ**





**వేములవాడ:** లైసెన్సుడు సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని రాజన్న సిరిసిల్ల జిల్లాఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో సోమవారం 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాలు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకొని, పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాకు చెందిన 66 మంది సర్వేయర్లకు లైసెన్సులు గతంలో అందజేసిందని గుర్తు చేశారు. గత ఏడాది జిల్లాకు చెందిన సివిల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన వారికి 50 రోజుల పాటు శిక్షణ ప్రభుత్వం అందించిందని, వారిలో శిక్షణ పూర్తి చేసుకొని పరీక్షలో పాస్ అయిన 25 మందికి లైసెన్స్ పత్రాలను అందించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.లైసెన్స్ పొందిన వారు అందరూ వారికి కేటాయించిన మండలాల్లో అందుబాటులో ఉండాలని, ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, నటరాజ్ సిబ్బంది ఉన్నారు.

# ఇంటర్ పరీక్షలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు

**16 కేంద్రాల్లో పరీక్షలు**
**హాజరుకానున్న 8,106 మంది ఫస్ట్, సెకండియర్ విద్యార్థులు**
**సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధం**



. **వేములవాడ:** ఫిబ్రవరి25 వ తేదీ నుంచి మార్చి నెల 16వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో సర్వం సిద్ధం చేశారు. పరీక్ష సమయానికంటే విద్యార్థులు గంట ముందే చేరుకోవాలి. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధం. ఈ ఏడాది పరీక్ష కేంద్రాల్లోకి నిమిషం ఆలస్యమైన అనుమతించకపోవడం నిబంధనను ప్రభుత్వం ఎత్తివేసింది. నిర్ణీత సమయం 09.00 గంటల తరువాత ఐదు నిముషాల లోపు చేరుకోవాలి.

ఉదయం 9 గంటల నుంచి..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4046, సెకండ్ ఇయర్ విద్యార్థులు 4060 పరీక్షకు హాజరు కానున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల (మార్చి 16వ తేదీ) దాకా నిర్వహించనున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటలకు మొదలై మధ్యాహ్నం 12 గంటల వరకు చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

గవర్నమెంట్ జూనియర్ కాలేజీ బాయ్స్ సిరిసిల్ల, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ గర్ల్స్ సిరిసిల్ల, సహస్ర జూనియర్ కాలేజీ సిరిసిల్ల, సాయిశ్రీ జూనియర్ కాలేజీ సిరిసిల్ల, టీజీఎస్ డబ్ల్యూఆర్జేసీ బద్దెనపల్లి, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ బాయ్స్ వేములవాడ, వివేకానంద జూనియర్ కాలేజీ వేములవాడ, సుమిత్ర శ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ వేములవాడ, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ కోనరావుపేట, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఇల్లంతకుంట, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ చందుర్తి, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రుద్రంగి, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ గంభీరావుపేట, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ముస్తాబాద్, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఎల్లారెడ్డిపేట్, రాచర్ల జూనియర్ కాలేజీ గొల్లపల్లిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేశారు. మూడు సెట్ల ప్రశ్నాపత్రాలు పోలీస్ స్టేషన్లకు చేర వేశారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 8333916289 అందుబాటులో ఉంటుంది.

144 సెక్షన్ అమలు..

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల సమీపంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు సూచించారు. హాల్ టికెట్లు ౧+దీ×జు వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలి. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్లు వెంట తీసుకురావాలని తెలిపారు.

పర్యవేక్షణకు బృందాలు..

పరీక్షల పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులతో బృందాలు ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. 350 నుంచి 400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

పరీక్షలు రాసే విద్యార్థులు కేంద్రాలకు గంట ముందే అనుమతిస్తారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఒత్తిడిలోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి అని ఇంచార్జ్ కలెక్టర్ గరిమెల అగర్వాల్ పేర్కొన్నారు


# అంగన్వాడి వర్కర్లకు గ్రాట్యుటీ ని అమలు చేయాలి: అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు గోవిందమ్మ మేరీ



**రాయదుర్గం ఫిబ్రవరి 23:**అంగన్వాడి వర్కర్లకు గ్రాట్యూటీ ని అమలు చేయాలని రాయదుర్గం ఐసిడిఎస్ స్ ప్రాజెక్టు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు గోవిందమ్మ మేరి మరియు సిఐటియు నాయకులు మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన రెండు రోజుల రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో భాగంగా రాయదుర్గం ప్రాజెక్టు కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, అంగన్వాడీలకు కనీస వేతనం రూ॥ 26,000/-లు ఇవ్వాలని,
పెండింగ్లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి, మెయిన్ సెంటర్లుగా మార్చాలని,గ్రాట్యుటీ అమలుకు గైడ్లైన్స్ రూపొందించాలని,వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలని,మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని లబ్దిదారులకు ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరాచేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాధమ్మ మరియు సెక్టర్ లీడర్లు రాధిక మెహ్రూన్ అనురాధ లలిత శోభ సావిత్రి మరియు రాయదుర్గం గుమ్మగట్ట డి. హీరేహళ్ మండలాల అంగన్వాడి వర్కర్లందరూ పాల్గొన్నారు.

# 23వ తేదీ నుండి ఏలూరు జిల్లాలో నిర్వహించబడుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు








**ఏలూరు జిల్లా :** ఇంటర్మీడి యట్23.వ తేది నుండి ఏలూరు జిల్లాలో నిర్వహించ బడుతున్న ఇంటర్మీ డియట్ మొదటి సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఖాూ గారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఇంటర్మీడియట్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతా వరణంలో రాసేలా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ గారు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు పరీక్షల నిర్వహణపై జిల్లాలోని పోలీస్ అధికారులకు మరియు ఎస్.హెచ్.ఓ లకు కీలక ఆదేశాలు జారీ చేసినారు.పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడమైనది అని, ప్రతి కేంద్రం వద్ద మహిళా అభ్యర్థుల తనిఖీ (Frisking) కోసం కచ్చితంగా ఒక మహిళా పోలీస్ కానిస్టేబుల్/హెడ్ కానిస్టేబుల్ ను నియమించడమైనది.పరీక్షా కేంద్రాల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా సంబంధిత మండల మెజిస్ట్రేట్ లు ద్వారా 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జెరాక్స్ సెంటర్లను పరీక్షా సమయంలో మూసివేయాలని స్పష్టం చేశారు విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బందిని మోహరించారు.ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినకుండా పరీక్షా కేంద్రాల సమీపంలో లౌడ్ స్పీకర్లు, డీజే లు, ఆర్కెస్ట్రాలు మరియు బహిరంగ సభలకు అనుమతి లేదని ఎస్పీ గారు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.పరీక్షలు ముగిసిన తర్వాత పేపర్లను భద్రంగా స్ట్రాంగ్ రూమ్లకు చేర్చే ప్రక్రియలో ఎస్కార్ట్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ గారు సూచించారు.ఈ పరీక్షల నిర్వహణలో ఏ విధమైన నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎస్పీ గారు హెచ్చరించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన ఆకాంక్షించారు ఏలూరు చుట్టుప్రక్కల ప్రాంతాలలో నివాసం ఉంటూ ఏలూరు లో నిర్వహించే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల విద్యార్థులు పరీక్షలకు హాజరైన సమయాలలో ఏదైనా ఆలస్యం జరిగిన యెడల వారి యొక్క సౌకర్యార్థం ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఫైర్ స్టేషన్ వద్ద మరియు బస్టాండ్ ప్రాంతాలలో పోలీసు వాహనాల ద్వారా సరైన సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరవేయడానికి ఏర్పాట్లు చేసినట్లుగా ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు తెలియ చేసినారు జిల్లా ఎస్పీ గారి తో పాటు గా ఎస్ బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు గారు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు గారు ఏలూరు 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర రావు గారు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ.. బాధ్యతలపై అవగాహన

**బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి: వేములవాడ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు అవగాహన**

**వేములవాడ :** వేములవాడ గ్రామీణ మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఇటీవల జరిగిన ఎన్నిక ల్లో విజయం సాధించిన వార్డు సభ్యులు మరియు ఉప సర్పంచులకు తమ విధులు, అధికారాలు, మరియు గ్రామాభివృద్ధిలో వారు పోషించాల్సిన పాత్రపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థలో వార్డు సభ్యులు, ఉప సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి, వాటిని గ్రామ పంచాయతీ సమావేశాల దృష్టికి తీసుకువెళ్లడం, అభివృద్ధి పనుల్లో క్రియాశీలకంగా పాల్గొనడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు తమ బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించి, ఆదర్శవంతమైన గ్రామాలను నిర్మించాలని అధికారులు సూచించారు.

# వెంకట్ సాయి ట్రాక్టర్ గ్యారేజీని ప్రారంభించిన మేయర్ కోలగని



**కరీంనగర్ :** పట్టణంలో వెంకట్ సాయి ట్రాక్టర్ గ్యారేజీని సోమవారం రోజున కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ట్రాక్టర్లకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. రైతుల వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్లు కీలక భూమిక పోషిస్తున్నాయని, అలాంటి ట్రాక్టర్ల రిపేర్ల కోసం వెంకట సాయి గ్యారేజ్ ను ప్రారంభించినందుకు అభినందిస్తున్నాన్నారు. గ్యారేజీ యాజమాన్యం రిపేర్లకు వచ్చిన రైతుకు సంబంధించిన ట్రాక్టర్ల విషయంలో నామమాత్రపు రిపేరు చార్జీలు వసూలు చేసి వారికి అండగా నిలవాలని మేయర్ కోలగని శ్రీనివాస్ సూచించారు .

# బకాయి ఉన్న తొమ్మిది నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలి : సిఐటియు




**రాయదుర్గంతో ఫిబ్రవరి 23.** రాయదుర్గం మున్సిపల్ పట్టణ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు 2025 సంవత్సరం ఏప్రిల్ నుండి 2026 జనవరి నెల అనగా దాదాపు 9 నెలల వేతనాలు బకాయిలుగా ఉన్నాయని తక్షణమే మున్సిపల్ కమిషనర్ గారు స్పందించి కార్మికులకు రావలసిన తొమ్మిది నెలల బకాయి వేతనాలను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి గారికి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ, స్వీపర్లకు ఇస్తున్న నాలుగువేల వేతనాన్ని కూడా ఇన్ని నెలలపాటు బకాయిలుగా ఉండడంవల్ల స్వీపర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను కమిషనర్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇందుకు స్పందించిన కమిషనర్ గారు మార్చి నెలలో ఈ కార్మికులకు కనీసం ఐదు నుండి 6 నెలల వేతనాన్ని ఇచ్చే విధంగా చూస్తారని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వీపర్లు లక్ష్మీదేవి నాగరత్నమ్మ జయమ్మ సుంకమ్మ తిప్పమ్మ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ఉద్యోగ, ఉపాధ్యాయుల హెల్త్ కార్డుల గురించి, ఆరోగ్యశ్రీ వర్తింపజేయుట గురించి మాట్లాడటం పట్ల సంతోషం, ధన్యవాదాలు వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు ముక్క సత్యం నారాయణ



**ఎన్టీఆర్ జిల్లా ఫిబ్రవరి 23** పెనుగంచిప్రోలు గ్రామంలోని ఈ రోజున గ్రామంలో ఒక పత్రిక ప్రకటనలో విడుదల చేసిన ప్రధానోపాధ్యాయ ులు ముక్క సత్యనారాయణ విడుదల చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో సోమవారం నాడు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ఉద్యోగ, ఉపాధ్యాయుల హెల్త్ కార్డుల గురించి, ఆరోగ్యశ్రీ వర్తింపజేయుట గురించి మాట్లాడటం పట్ల సంతోషం, ధన్యవాదాలు వ్యక్తం చేస్తున్నాను. వాస్తవానికి ప్రతినెల మూడు వందల రూపాయలు ప్రీమియం చెల్లిస్తూ ఉన్నప్పటికీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కింద ఉద్యోగులకు పెద్దగా ప్రయోజనం జరగటం లేదు. శాసనసభ్యులు చెప్పినట్లు తీవ్రమైన వ్యాధుల విషయంలో ప్రాణ నష్టం జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల హెల్త్ స్కీమ్ లో మార్పులు తీసుకుని వచ్చి కేటాయింపు పెంచాలని కోరుతున్నాము. పూర్తిగా నగదు రహిత వైద్య సహాయం అన్ని ప్రముఖ ఆసుపత్రులలో వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలి. ముక్కా సత్యనారాయణ ఉపాధ్యాయ సంఘ సీనియర్ నేత.

# మసీద్ ను సందర్శించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**ఎన్టీఆర్ జిల్లా ఫిబ్రవరి 23** జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, సిసి రోడ్ల శంకుస్థాపనకు విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం షేర్ మహమ్మద్ పేట గ్రామంలోని మసీద్ లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తో కలిసి సందర్శించారు. మత పెద్దలు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ను ముస్లిం సంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎంపీ కేశినేని శివనాథ్ దృష్టికి కొన్ని సమస్యలు తీసుకొని రాగా, వాటిని ఒక్కొక్కటిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తో కలిసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారందరికీ ఎంపీ, ఎమ్మెల్యే రంజాన్ శుభాకంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, ఏఎంసీ చైర్మన్ మల్లెల సీతమ్మ, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో –కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.టి.యు.సి జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి లతో పాటు షేర్ మహహ్మద్ పేట ముస్లిం మత పెద్దలు, స్థానిక ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అభిషేక్ శర్మపై వేటు



## సంజూ శాంసన్‌ను జట్టులోకి..

దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక సూపర్-8 మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన తర్వాత టీమిండియా యాజమాన్యం మేల్కొంది. ఈ ఓటమి కేవలం ఒక మ్యాచ్ పరాజయం మాత్రమే కాదు.. భారత్ సెమీఫైనల్ ఆశలను కూడా దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో జింబాబ్వే, వెస్టిండీస్‌తో జరగబోయే కీలక మ్యాచ్‌ల కోసం ప్లేయింగ్ ఎలెవన్‌లో భారీ మార్పులు చేసేందుకు గౌతమ్ గంభీర్ సేన సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మపై వేటు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కడుపు ఇన్ఫెక్షన్ నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన అభిషేక్ శర్మ.. పాకిస్థాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌ల్లో కనీసం ఖాతా తెరవలేకపోయాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక పోరులోనూ కేవలం 15 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. దీంతో అభిషేక్ స్థానంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకోవాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది.ప్రస్తుతం భారత టాపార్డర్ అంతా ఎడమచేతి వాటం బ్యాటర్లతోనే (అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ) నిండిపోయింది. ఇది ప్రత్యర్థి జట్ల స్పిన్నర్లకు వరంగా మారుతోంది. ఈ ఏకపక్ష బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చాలని కోచింగ్ స్టాఫ్ భావిస్తోంది. సహాయ కోచ్ ర్యాన్ టెన్ డోష్చేట్ మాట్లాడుతూ.. "సంజూ శాంసన్ ఓ అద్భుతమైన ఆటగాడు. అతనిని టాపార్డర్‌లో చేర్చడం వల్ల వ్యూహాత్మకంగా రైట్ హ్యాండ్ – లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ సెట్ అవుతుంది. జట్టులో మార్పుల గురించి రాబోయే రెండు రోజుల్లో చర్చిస్తాం" అని పేర్కొన్నారు. కేవలం అభిషేక్ శర్మ మాత్రమే కాదు.. తిలక్ వర్మ, రింకూ సింగ్ ప్రదర్శనలపై కూడా మేనేజ్‌మెంట్ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ ముగ్గురిలో కనీసం ఒకరిని పక్కన పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. భారీ హిట్టర్‌గా పేరున్న రింకూ సింగ్ దక్షిణాఫ్రికాపై డకౌట్ అవ్వడం టీమిండియా మిడిలార్డర్ బలహీనతను బయటపెట్టింది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లను జింబాబ్వే, వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంది. సెమీస్ చేరాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలవడమే కాకుండా, నెట్ రన్ రేట్‌ను కూడా భారీగా మెరుగుపరుచుకోవాలి. ఈ క్రమంలో గంభీర్ మార్క్ 'అగ్రెసివ్' నిర్ణయాలు ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండబోతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.



# టీమిండియా జట్టులో కీలక మార్పులు

### - సౌతాఫ్రికా చేతిలో పరాజయంతో నిర్ణయం

టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఘోర పరాజయం టీమిండియాను ఆలోచనలో పడేసింది. ఈ ఓటమి నేర్పిన పాఠాలతో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ ఇప్పుడు జట్టులో కీలక మార్పులకు సిద్ధమవుతున్నారు. సూపర్-8లో భారత్ తన తదుపరి పోరులో జింబాబ్వేను ఎదుర్కోనుంది. ఈ మ్యాచ్ చెన్నైలోని ప్రతిష్టాత్మక ఎం.ఏ.చిదంబరం స్టేడియం (చెపాక్) వేదికగా జరగనుంది. చెన్నై పిచ్ స్వభావం దృష్ట్యా భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో భారీ మార్పులు ఉండబోతున్నాయని సమాచారం. చెపాక్ స్టేడియం అంటేనే స్పిన్నర్ల స్వర్గధామం. ఇక్కడ బంతి బాగా టర్న్ అవుతుంది కాబట్టి, భారత్ ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో దూరమైన స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తిరిగి జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ జట్టులోకి వస్తే బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ బలం పెరుగుతుందని మేనేజ్మెంట్ భావిస్తోంది. అలాగే ప్రత్యర్థి బ్యాటర్లను తన మాయాజాలంతో తిప్పికొట్టేందుకు చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ కూడా తుది జట్టులోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు, యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ ఇప్పుడు జట్టుకు తలనొప్పిగా మారింది. ఈ వరల్డ్ కప్‌లో అతను వరుసగా విఫలమవుతుండటంతో, అతని స్థానంలో సంజూ శామ్సన్‌ను ఆడించాలనే డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి.



# ఒత్తిడిలో చిక్కుకుపోయిన అభిషేక్ శర్మ

### - భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్

టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక సూపర్-8 మ్యాచ్‌లో కూడా అభిషేక్ శర్మ(12 బంతుల్లో 15 పరుగులు) తక్కువ స్కోరుకే వెనుదిరగడంపై భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించారు. టోర్నీకి ముందు అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ.. ప్రపంచ కప్ వంటి మెగా ఈవెంట్లో ఎందుకు తడబడుతున్నారో గవాస్కర్ విశ్లేషించారు.స్టార్ స్పోర్ట్స్‌తో సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నప్పుడు ఉండే ఒత్తిడి ఆటగాడి సహజసిద్ధమైన శైలిని ఎలా దెబ్బతీస్తుందో వివరించారు. "నెట్స్‌లో ప్రాక్టీస్ చేసేటప్పుడు ఔట్ అయినా మళ్లీ బంతిని ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. కానీ మ్యాచ్‌లో అలా కాదు, ఒక్క వికెట్ పడితే అంతా అయిపోతుంది. ఆ ఒత్తిడి కారణంగా ఆటగాడి కాళ్లు, చేతులు ఒక్కోసారి స్తంభిస్తాయి . అందుకే అభిషేక్ తన ఫ్రీడమ్‌ను కోల్పోయి ఆడుతున్నాడు" అని గవాస్కర్ అభిప్రాయపడ్డారు.దక్షిణాఫ్రికా బౌలర్లు అభిషేక్ శర్మను కట్టడి చేయడానికి పక్కా వ్యూహంతో బరిలోకి దిగారని గవాస్కర్ పేర్కొన్నారు. "అభిషేక్ సాధారణంగా రూమ్ చేసుకుని ఆఫ్ సైడ్ షాట్లు ఆడటానికి ఇష్టపడతాడు. అందుకే రబాడ వంటి బౌలర్లు అతనికి ఏమాత్రం గ్యాప్ ఇవ్వకుండా పదేపదే ప్యాడ్లను లక్ష్యంగా చేసుకుని బంతులు వేశారు. ఒక సిక్స్ కొట్టినప్పటికీ.. దక్షిణాఫ్రికా బౌలర్లు తమ ప్లాన్ మార్చుకోకుండా తెలివిగా బౌలింగ్ చేసి అతడిని ఇబ్బంది పెట్టారు" అని చెప్పుకొచ్చారు.

# టీమిండియా ఓటమికి ఆ రెండు తప్పిదాలే కారణం..

### టీమిండియాపై మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ ఫైర్



దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ 8 పోరులో భారత్ 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమి భారత సెమీఫైనల్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చడమే కాకుండా, జట్టు ఎంపిక, బ్యాటింగ్ క్రమంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. అశ్విన్ తన విశ్లేషణలో ప్రధానంగా అక్షర్ పటేల్‌ను జట్టు నుండి తొలగించడం, రింకూ సింగ్‌ను 8వ నంబర్‌లో బ్యాటింగ్‌కు పంపడం అనేవి జట్టు సమతూకాన్ని దెబ్బతీశాయని పేర్కొన్నారు.జట్టు యాజమాన్యం మ్యాచ్-అప్‌ల పేరుతో అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకోవడాన్ని అశ్విన్ తప్పుబట్టారు. ఐపీఎల్ వంటి సుదీర్ఘ టోర్నీలలో మ్యాచ్-అప్‌లు పని చేస్తాయని, కానీ ప్రపంచకప్ వంటి ఐసీసీ టోర్నీలలో జట్టు స్థిరత్వం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. టీ20 క్రికెట్‌లో అక్షర్ పటేల్ టీమ్ ఇండియాకు 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్'అని, గత ప్రపంచకప్‌లో కూడా దక్షిణాఫ్రికాపై ఒత్తిడిలో ఆయన అద్భుత ప్రదర్శన చేశారని అశ్విన్ గుర్తు చేశారు.సమతూకం దెబ్బతింది: అక్షర్ లేకపోవడం వల్ల మిడిల్ ఓవర్లలో జట్టుకు ఉండాల్సిన ఎడమచేతి వాటం బ్యాటింగ్ బలం తగ్గిందని, ఇది దక్షిణాఫ్రికా స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయించేలా చేసిందని ఆయన విశ్లేషించారు. మరో ముఖ్యమైన తప్పిదం రింకూ సింగ్‌ను 8వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపడం అని అశ్విన్ అన్నారు. ఫినిషర్‌గా పేరున్న రింకూకు తగినన్ని ఓవర్లు లభించకపోవడం వల్ల భారత బ్యాటింగ్ భారీ స్కోరును సాధించలేకపోయిందని లేదా లక్ష్య ఛేదనలో వెనుకబడిందని ఆయన పేర్కొన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో నిరంతరం మార్పులు చేయడం వల్ల ఆటగాళ్ళలో అభద్రతాభావం ఏర్పడుతుందని, అది వారి సహజ సిద్ధమైన ఆటను దెబ్బతీస్తుందని అశ్విన్ హెచ్చరించారు.బ్యాటర్ల టెక్నిక్ గురించి కూడా అశ్విన్ ఘాటుగా స్పందించారు. భారత బ్యాటర్లు స్పిన్‌ను ఎదుర్కోవడంలో ప్రపంచంలోనే అత్యంత బలహీనంగా తయారయ్యారని ఆయన వ్యాఖ్యానించారు.

# చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో హార్దిక్, మహికా సందడి.



టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతున్న తరుణంలో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మైదానంలో కంటే మైదానం బయటే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నాడు. హార్దిక్ పాండ్యా తన కొత్త గర్ల్‌ఫ్రెండ్, నటి మహికి శర్మతో రిలేషన్‌లో ఉన్నాడనే వార్తలు ఇప్పుడు అధికారికంగా ధ్రువీకరించబడినట్లు కనిపిస్తోంది. టోర్నీ ప్రారంభం నుంచి టీమిండియా ఎక్కడికి వెళ్తే మహికి అక్కడే ప్రత్యక్షమవుతోంది. తాజాగా భారత జట్టు తన తదుపరి మ్యాచ్ కోసం చెన్నై చేరుకోగా, ఎయిర్‌పోర్ట్‌లో హార్దిక్ తన ప్రియురాలి భుజంపై చేయి వేసి నడుస్తున్న ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో వీరిద్దరి ప్రేమాయణం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వ్యక్తిగత జీవితం సంగతి పక్కన పెడితే, హార్దిక్ పాండ్యా ఆటతీరుపై మాత్రం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన సీనియర్ ప్లేయర్, మైదానంలో మాత్రం చేతులెత్తేస్తున్నాడనే ఆగ్రహం అభిమానుల్లో కనిపిస్తోంది. గ్రూప్ స్టేజ్‌లో నమీబియా వంటి చిన్న జట్టుపై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన హార్దిక్, అసలైన సూపర్ 8 పోరులో మాత్రం విఫలమయ్యాడు. సౌతాఫ్రికాతో జరిగిన కీలక మ్యాచ్‌లో బౌలింగ్‌లో 4 ఓవర్లలో ఏకంగా 45 పరుగులు సమర్పించుకోవడమే కాకుండా, బ్యాటింగ్‌లో కూడా 17 బంతుల్లో కేవలం 18 పరుగులు మాత్రమే చేసి ఒత్తిడిలో నిలబడలేకపోయాడు. హార్దిక్ పాండ్యా తన ప్రియురాలి పుట్టినరోజు వేడుకలను కూడా అహ్మదాబాద్‌లోని టీమ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించాడు. జట్టులోని ఇతర సభ్యులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే, అభిమానుల ప్రశ్న మాత్రం ఒక్కటే.. రొమాన్స్ ఓకే.. కానీ టీమిండియాను ఎప్పుడు గెలిపిస్తావు హార్దిక్. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన పాండ్యా, ఇప్పటివరకు పెద్ద జట్లపై తన మార్కు చూపించలేకపోయాడు. బౌలింగ్‌లో పరుగులు నియంత్రించలేకపోవడం, బ్యాటింగ్‌లో స్ట్రైక్ రేట్ మందగించడం జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తోంది.తదుపరి మ్యాచ్ జింబాబ్వేతో చెన్నైలోని చేపాక్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే మహికా శర్మ చెన్నై చేరుకోవడంతో, ఈ మ్యాచ్‌లోనైనా హార్దిక్ బ్యాట్‌తో లేదా బంతితో విన్యాసాలు చేస్తాడో లేదో చూడాలి. ఒక ప్రొఫెషనల్ క్రికెటర్‌గా తన ప్రధాన బాధ్యత దేశాన్ని గెలిపించడమేనని హార్దిక్ గుర్తించాలని మాజీ క్రికెటర్లు సైతం సూచిస్తున్నారు. మరి జింబాబ్వేపై అయినా ఈ స్టార్ ప్లేయర్ తన పాత ఫామ్ అందుకుని విమర్శకుల నోళ్లు మూయిస్తాడో లేదో వేచి చూడాలి.

## వాంఖడేలో హిట్మేయర్ ఊచకత..



ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్--8 దశలో వెస్టిండీస్ జం జింబాబ్వే మధ్య జరుగుతున్న కీలక మ్యాచ్ క్రికెట్ అభిమానులను ఉత్కంఠకు గురిచేస్తోంది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైయర్ కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి స్టేడియాన్ని ఉర్రూతలూగించాడు. అతడి మెరుపు ఇన్నింగ్స్‌తో వెస్టిండీస్ స్కోర్ బోర్డు వేగంగా దూసుకెళ్తోంది. టాస్ గెలిచిన జింబాబ్వే ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, వెస్టిండీస్ బ్యాటింగ్ ప్రారంభించింది. పవర్‌ప్లేలో కొంత ఒత్తిడి ఎదురైనా, మిడిల్ ఓవర్లలో హెట్‌మైయర్ క్రీజ్‌లోకి దిగిన వెంటనే మ్యాచ్ సీన్ పూర్తిగా మారిపోయింది. స్పిన్నర్లపై దూకుడుగా, పేసర్లపై పవర్ ఫుల్ షాట్లతో అతడు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం ఈ వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ తరఫున వేగవంతమైన అర్ధశతకాలలో ఒకటిగా నిలిచింది. హెట్‌మైయర్ 5 వరుస సిక్సర్లు, 5 ఫోర్లు బాదడంతో జింబాబ్వే బౌలర్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. మరో వైపు బ్యాటింగ్ చేసిన సహచరులు కూడా స్థిరంగా నిలబడి భాగస్వామ్యాన్ని నిర్మించడంతో వెస్టిండీస్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లింది.

# టీమిండియా సెమీ-ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం



టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌కు అనూహ్యమైన భారీ షాక్ తగిలింది. ఆదివారం నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా 76 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయం భారత జట్టు సెమీ-ఫైనల్ అవకాశాలను తీవ్రంగా సంక్లిష్టం చేసింది. కేవలం ఓటమి మాత్రమే కాకుండా, భారీ తేడాతో ఓడిపోవడంతో భారత జట్టు నెట్ రన్ రేట్ఘోరంగా దెబ్బతింది. ప్రస్తుతం టీమిండియా నెట్ రన్ రేట్ -3.800గా నమోదైంది. ఇది సెమీస్ రేసులో భారత్‌కు తీవ్ర ప్రతికూలంగా మారింది. టీమిండియా సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే, మిగిలి ఉన్న రెండు సూపర్ 8 మ్యాచ్‌లలో భారీ విజయాలు సాధించడం తప్పనిసరి. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లలో వెస్టిండీస్, జింబాబ్వే జట్లతో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లలో విజయాలు సాధించడం ద్వారా భారత్ ఖాతాలో నాలుగు పాయింట్లు వచ్చి చేరతాయి.


# పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు



టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ– రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్" అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. లఅభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.

----------------


# త్రివిక్రమ్-వెంకి కాంబోలో ఎకె 47




టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఎకె 47' విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం. ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు రైటర్ హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్–వెంకీ ఇప్పుడు డైరెక్టర్ హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.

# ది ప్యారడైజ్ ప్రోమో సాంగ్ విడుదల

నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు





సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# ఉస్తాద్ భగత్ సింగ్ సెకండ్ సింగిల్ కు విశేష స్పందన

పవర్ స్టార్ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి రెండో పాట విడుదలైంది. 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పేరుతో విడుదలైన ఈ పాట యూట్యూబ్‌లో విశేష స్పందనతో దూసుకెళ్తోంది. ముఖ్యంగా పవన్ అభిమానులను ఈ పాట ఉర్రూతలూగిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

దేవి శ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ పవర్‌ఫుల్ సాహిత్యం అందించారు. 'నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే' అనే హుక్ లైన్‌తో మొదలయ్యే ఈ పాట, పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో జరిగిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో అభిమానుల మధ్య ఈ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ, పవన్ గత రెండు దశాబ్దాలుగా మెడ పట్టుకోవడం ఒక మేనరిజంగా చేస్తున్నారన్నారు. దానికి మాట రూపం ఇస్తే బాగుంటుందని 'నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ రాశానని చెప్పారు. దాన్నే హుక్ లైన్‌గా తీసుకుని చంద్రబోస్ కేవలం 8 గంటల్లో అద్భుతమైన పాట రాశారని తెలిపారు. ఇది పవన్‌పై అవగాహనతో రాసిన పాట అని, దేవిశ్రీ పాటాభిషేకం చేస్తే, చంద్రబోస్ సిరాభిషేకం చేశారని ప్రశంసించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. చిత్రాన్ని ఈ ఏడాది మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పాటతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



# నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లు : శ్రుతి హాసన్

నటి, గాయని శ్రుతి హాసన్ 'ఇల్లు' అనే భావనపై తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇల్లు అంటే మ్యాప్‌లోని ఒక ప్రదేశం కాదని, అది ఒక లోతైన, వ్యక్తిగతమైన ఫీలింగ్ అని ఆమె అన్నారు. పలు భాషా చిత్ర పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో, తనకు ఇల్లు అనే భావనపై అవగాహన పూర్తిగా మారిపోయిందని శ్రుతి తెలిపారు.

ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "నాకు ఇల్లు అంటే అస్సలు భౌగోళిక ప్రదేశం కాదని గ్రహించాను. చెన్నైకి వెళ్లినప్పుడు నాకు అనంతమైన ప్రేమ, సౌకర్యం లభిస్తాయి. ముంబైలో మరో రకమైన ప్రేమను పొందుతాను. హైదరాబాద్‌లో పనిచేస్తున్నందున ఇక్కడ భిన్నమైన అనుబంధం ఉంటుంది" అని వివరించారు. ప్రతి నగరం తనకు ప్రత్యేకమైన అనుభూతిని పంచిందని ఆమె చెప్పారు. అయితే కాలక్రమేణా ఒక ముఖ్యమైన విషయాన్ని గ్రహించానని ఆమె తెలిపారు. "నన్ను ఎక్కడైనా వదిలేసినా, నేను సౌకర్యాన్ని వెతుక్కోగలను. ఒక ప్రదేశం, అక్కడి ప్రజలు, సంస్కృతి గురించి తెలుసుకుని, అందులో నాకు నచ్చిన దాన్ని నా సొంతం చేసుకుంటాను. నిజానికి నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లు" అని శ్రుతి పేర్కొన్నారు. నాలో నాకు సౌకర్యంగా లేనప్పుడు, సొంత ఇంట్లో ఉన్నా సరే అసౌకర్యంగానే అనిపిస్తుందని అన్నారు. "నాకు నేనే ఇల్లు అనే భావన నా మెదడులో బలంగా నాటుకుపోయింది. జీవితంలో దేన్నైనా ఎదుర్కోవడానికి ఇది నాకు గొప్ప భద్రతను, భరోసాను ఇచ్చింది. ఈ ఆలోచన స్వార్థంగా అనిపించినా, నాకు బాగా పనిచేసింది. నాన్న (కమల్ హాసన్) తప్ప మరే వ్యక్తి నాకు ఇల్లులా సౌకర్యవంతంగా అనిపించలేదు" అని శ్రుతి స్పష్టం చేశారు.





# అల్లువారింట పెళ్లి సందడి

## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం

అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com